


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 16 జూలై 2021 | సంపుటి : 02 | సంచిక :352 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

### కరోనా కట్టడిలో యూపీ భేష్
### వారాణాసి పర్యటనలో ప్రధాని మోదీ ప్రశంస





వారణాసి: ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ కాశీలో రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. జపాన్ దేశ సహకారంతో ఆ కేంద్రాన్ని నిర్మించారు. కాశీ అంటే శివుడు అని, రుద్రాక్ష్ లేకుండా ఆ నగరం అభివృద్ధి చెందినట్లు ఎలా చెబుతామని ఆయన అన్నారు. కాశీ పట్టణం ఇప్పుడు రుద్రాక్షను ధరించినట్లు ఆయన తెలిపారు. ఇక నుంచి ఆ పట్టణ శోభ మరింత పెరుగుతుందని ప్రధాని చెప్పారు. వారాణాసిలో పర్యటిస్తున్న ప్రధాని అక్కడ 1500 విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. కన్వెన్షన్ సెంటర్‌లో రుద్రాక్ష మొక్కను నాటారు. ఈ సందర్భంగా సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా మాట్లాడారు. వారణాసిలో రుద్రాక్ష్ సెంటర్‌ను నిర్మించినందుకు ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని యోషిడే సుగాకు ఆయన కృతజ్ఞతలు ఎతలిపారు. ఇండో-జపాన్ స్నేహానికి రుద్రాక్ష్ సెంటర్ సంకేతంగా నిలుస్తుందని యోగి అన్నారు. ఆధునిక సాంకేతికతో రుద్రాక్ష్‌ను నిర్మించారు. సుమారు 1,200 మంది కూర్చునే సామర్థం కలిగి ఉంది. రెండు అంతస్తుల కన్వెన్షన్ సెంటర్‌ను జపనీస్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) సహకారంతో నిర్మించారు. దాదాపు 200 కోట్ల వ్యయంతో మూడు ఎకరాల విస్తీర్ణంలో వారణాసిలోని సిగ్రా ప్రాంతంలో దీన్ని నిర్మించారు. ఈ సెంటర్ లో అన్ని రకాల అంతర్జాతీయ సమావేశాలు, సంగీత కచేరీలు, ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తూనే అందుకు కావాల్సిన సదుపాయాల్ని అందించనున్నారు. కరోనా వైరస్‌ను ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం అద్భుతంగా కట్టడి చేయగలిగిందని ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. తన సొంత నియోజకవర్గమైన వారణాసిలో గురువారం పర్యటిస్తున్న ఆయన.. ఈ సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని అభినందించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ మైదానంలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.‘‘యూపీ ప్రభుత్వం వైరస్‌పై సమర్థంగా పోరాడింది. దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఈ రాష్ట్రం మహమ్మారిని కట్టడి చేసిన తీరు ప్రశంసనీయం. కరోనా వారియర్లకు, ఈ క్లిష్ట సమయంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే దేశంలో అత్యధిక టీకాలు పంపిణీ చేసిన రాష్ట్రంగా యూపీ నిలిచింది. అందరికీ టీకా అందించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం దిశగా ఈ రాష్ట్రం ముందుకెళ్తోంది‘‘ అని ప్రధాని అన్నారు. అంతేకాకుండా కాశీ నగరం త్వరలో మెడికల్ హబ్‌గా మారనుందని చెప్పారు. ఇక నుంచి వైద్యసేవల కోసం దిల్లీ, ముంబయి వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని, అన్నీ ఇక్కడే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కరోనా విజృంభణ వేళ కాంవడ్ యాత్రకు అనుమతివ్వడంపై నిన్న సుప్రీంకోర్టు యూపీ ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేసింది. శుక్రవారంలోగా సమాధానం ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. ఆ మరుసటిరోజే ప్రధాని యోగి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం గమనార్హం. కరోనా రెండోదఫా విజృంభణ సమయంలో ఆ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఒక్కరోజే 30 వేల కేసులు వెలుగుచూశాయి. మొదటి దఫాలో అవి ఏడువేలు మాత్రమే.

## వైసీపీ ప్రభుత్వ పాలనకు అద్దంపట్టేలా రోడ్ల దుస్థితి: దేవినేని

అమరావతి: రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమా



తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్వీట్టర్ వేదికగా స్పందిస్తూ....‘‘ఏపీలో రోడ్లపై ప్రయాణమంటే భయపడుతున్న ప్రజలు. గుంతలమయమై చెరువులను తలపిస్తున్న వైనం. 27నెలలుగా కొత్తరోడ్ల ఊసేలేదు, పాతవాటికి మరమ్మత్తులు లేవు. ప్రభుత్వ తీరుతో ముందుకురాని కాంట్రాక్టర్లు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితి మీ ప్రభుత్వ పరిపాలనకు అద్దంపడుతుందంటున్న మాట వాస్తవం కాదా? వైయస్ జగన్‌వవ అంటూ దేవినేని ట్వీట్ చేశారు.

## ప్రత్యేక హో దా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు: విజయసాయిరెడ్డి

విజయవాడ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ భేటీ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విభజన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరతామని, ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ మొదట్నుంచీ పోరాడుతుందని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. పోలవరం సవరించిన అంచనాల గురించి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ పెండింగ్ నిధుల అంశాన్ని లేవనెత్తుతామని చెప్పారు. తెలంగాణ చేపట్టిన అక్రమ ప్రాజెక్ట్‌లను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని, కేఆర్‌ఎంబీ పరిధిని కేంద్రం నోటిఫై చేయాలని కోరతామని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని, తెలంగాణ నుంచి రూ. 6,112 కోట్లు విద్యుత్ బకాయిలు రావాలన్నారు. తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 12సార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. దిశ చట్టాన్ని ఆమోదించాలని కోరతాంమని, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కోసం పీఎంఏవై కింద నిధులు ఇవ్వాలని కోరతామని తెలిపారు. ట్రైబల్ యూనివర్శిటీని నాన్‌ట్రైబల్ ఏరియాలో కేటాయించారని, దాన్ని సాలూరులో పెట్టాలని కోరతామని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 19 న ప్రారంభమై ఆగస్టు 13 తో ముగియనున్నాయి.

## చైనా కుయుక్తులు.. సరిహద్దుల్లో కాంక్రీట్ నిర్మాణాలు

### వాస్తవాధీన రేఖ వద్ద సుదీర్ఘకాలం ఉండేందుకు డ్రాగన్ చర్యలు



దిల్లీ: భారత్, చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు ఇంకా సద్దుమణగనేలేదు.. కానీ డ్రాగన్ మాత్రం పదేపదే తన వక్రబుద్ధి ప్రదర్శిస్తూనే ఉంది. కుయుక్తులు పన్నుతూనే ఉంది. సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామంటూ నీతులు వల్లిస్తూనే.. వాస్తవాధీన రేఖ సమీపంలో భారీగా శాశ్వత నిర్మాణాలు చేపడుతోంది. వివాదాస్పద ప్రాంతాలకు అత్యంత త్వరగా బలగాలను చేర్చేందుకు వీలుగా సరిహద్దుల్లో కాంక్రీట్ శిబిరాలను నిర్మిస్తోందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఉత్తర సిక్కిం నకులా ప్రాంతంలో వాస్తవాధీన రేఖకు సమీపంలో చైనా తమ భూభాగంలో ఈ కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నకులా సెక్టార్‌లో గతేడాది భారత్, చైనా బలగాలకు ఘర్షణ జరిగిన ప్రాంతానికి ఈ నిర్మాణాలు కొద్ది మీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. ఇక తూర్పు లద్దాఖ్, అరుణాచల్ సెక్టార్‌ల వద్ద కూడా చైనా వైపు ఈ తరహా అధునాతన భవన నిర్మాణలు చేపట్టినట్టు తెలుస్తోంది. తూర్పు లద్దాఖ్ వంటి ఎత్తైన ప్రదేశాల్లో చలికాలంలో వాతావరణ పరిస్థితులు కఠినంగా ఉంటాయి. దీంతో చలికాలంలో ఈ ప్రాంతాల్లో చైనా తమ బలగాల్లో 90శాతం మందిని విడతల వారీగా మార్చాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో బలగాల సౌకర్యార్థం సరిహద్దుల్లో చైనా ఈ నిర్మాణాలు చేపట్టినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ శాశ్వత నిర్మాణాలతో సరిహద్దుల్లో సుదీర్ఘకాలం పాటు బలగాలను మోహరించాలన్న డ్రాగన్ ఉద్దేశం స్పష్టంగా బయటపడుతోంది. అంతేగాక, సరిహద్దులకు వచ్చే రోడ్డు మార్గాలను కూడా చైనా మరింత మెరుగుపర్చింది. అంటే.. ఉద్రిక్తతల సమయంలో భారత్ కంటే ముందుగానే వచ్చి స్పందించేందుకు వీలుగా ఈ ప్రాంతాల్లో డ్రాగన్ మౌలిక సదుపాయాలను పెంచుకుంటోంది. తూర్పు లద్దాఖ్ ఉద్రిక్తతలతో రెండు దేశాల మధ్య గతేడాది నుంచి ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. గల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య ఘర్షణలతో ఈ ఉద్రిక్తతలు మరింత తీవ్రంగా మారాయి. ఈ క్రమంలోనే రెండు దేశాల సైనికాధికారులు పలు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ పూర్తిస్థాయిలో వివాదం సద్దుమణగలేదు. అయితే తూర్పు లద్దాఖ్‌లో ఇరువైపులా బలగాల ఉపసంహరణకు రెండు దేశాలు అంగీకరించాయి. దీంతో పాంగాంగ్ సరస్సు నుంచి బలగాలను వెనక్కి పిలిచిన డ్రాగన్.. వారిని టిబెట్‌కు తరలించింది.

## ఆ నిర్ణయం చారిత్రాత్మకం: మంత్రి కన్నబాబు



విజయవాడ: అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రూ. 8 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి వర్తిస్తుందన్నారు. ఉద్యోగ నియామకాల్లో కేంద్ర నిబంధనలను మార్పులు చేశారన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై గత ప్రభుత్వం గందరగోళం సృష్టించిందన్నారు. గత ప్రభుత్వ తీర్మానాలపై కేంద్రం లేఖలు రాసినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. కాపులను చంద్రబాబు ఏ విధంగా మోసం చేశారో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఉదాహరణ అన్నారు. “బీసీ ఎఫ్ కేటగిరీ అని, మళ్లీ ఈడబ్ల్యూఎస్‌లో 5 శాతం పేరుతో రెండు తీర్మానాలు చేశారు. చంద్రబాబు గతంలో కాపులను మోసం చేసేలా తీర్మానం చేశారు. చంద్రబాబు దృష్టిలో కాపులు బీసీలా? ఓసీలా అర్థం కాని పరిస్థితి. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో చంద్రబాబు ఓటు బ్యాంకు రాజకీయాలతో కాపులు నష్టపోయారని.. కులాల మధ్య విద్వేషాలు సృష్టించే విధంగా బాబు వ్యవహరించారని కన్నబాబు దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇచ్చిన స్పష్టమైన జీవోతో కాపులతోపాటు అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు అమలుచేస్తామన్నారు.

## ముగిసిన వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ భేటీ

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసింది. ఈ భేటీకి పార్టీ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై సభ్యులకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. విశాఖ ఉక్కు, కృష్ణా జలాలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులపై చర్చ జరిపారు.

**పార్లమెంట్‌లో విశాఖ ఉక్కుపై పోరాడతాం: ఎంపీ మిథున్‌రెడ్డి**

భేటీకి ముందు ఎంపీ మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, పార్లమెంట్‌లో విశాఖ ఉక్కుపై పోరాడతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని కోరతామని తెలిపారు. కృష్ణా



జలాలపై ఇరురాష్ట్రాల మధ్య వివాదాన్ని పరిష్కరించాలని కోరతామని పేర్కొన్నారు. దిశ చట్టం ఆమోదం, రాష్ట్ర అంశాలను ప్రస్తావిస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు.

## జాదూ క్యాలెండర్ విడుదల చేసారు

అమరావతి జూలై 15, (న్యూస్ పల్స్) టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో నిరుద్యోగ యువతతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సమావేశం అయ్యారు. ఫ్యాన్ కి ఓటేస్తే నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తానన్న జగన్ రెడ్డి, అదే ఫ్యాన్ కు నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకునే దుస్థితి కల్పించారు. జాబ్ క్యాలెండర్ పేరిట జాదూ క్యాలెండర్ విడుదల చేశారని లోకేష్ అన్నారు. బైబై బాబు అనే నినాదంతో చంద్రబాబు ని ఓడించామనుకుని రాష్ట్రాన్ని ఓడించారు. పరిశ్రమలన్నీ బైబై ఆంధ్రప్రదేశ్ అంటున్నాయి. 2.30లక్షల ఉద్యోగాలకు బదులు 10వేలిచ్చి



పండుగ చేసుకోమంటున్నారు. జగన్ మెడలు వంచైనా 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేలా పోరాడతామని అయన అన్నారు. జే ట్యాక్స్ దెబ్బకి రెండేళ్ల పాలనలో ఒక్క ప్రైవేట్ కంపెనీ కూడా ఆంధ్రపదేశ్ వైపు చూడలేదు. రిలయన్స్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్,ట్రైటాన్,లులూ,అదానీ ఇలా అనేక కంపెనీలు ఆంధ్రప్రదేశ్ కి బై బై చెప్పేసాయి. ప్రైవేట్ కంపెనీలు రావు. ప్రభుత్వ ఉద్యోగాలు లేవు. జాదూ క్యాలెండర్ విడుదల చేస్తూ రెండేళ్ల లో 6 లక్షల ఉద్యోగాలు కల్పించామంటూ ఫేక్ కబుర్లు చెప్పారు. కార్యకర్తలకు ఇచ్చిన వాలంటీర్ పోస్టులు, పేపర్ లీక్ చేసి అమ్ముకున్న సచివాలయ పోస్టులు,దశాబ్దాలుగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగాలు,కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఇలా చెప్పుకుంటేపోతే మొత్తం ఫేక్ లెక్కలే. వాలంటీర్లు – 2.6 లక్షల మంది.‘వాలంటీర్ అంటే స్వచ్ఛందంగా సేవ చెయ్యడం. ఇది ఉద్యోగం కాదన్నది జగన్ మోసపు రెడ్డి గారే. మరి ఇప్పుడు ఉద్యోగాల లిస్టులో కలపడానికి సిగ్గు వెయ్యలేదా? 90 శాతం వాలంటీర్ పోస్టులు కార్యకర్తలకే ఇచ్చాం అని ఏ2 రెడ్డి గొప్పగా ప్రకటించారు. గ్రామ,వార్డు సచివాలయం – 1.21 లక్షలు. పేపర్ లీక్ చేసి, వైకాపా కార్యకర్తలకు అమ్ముకున్నారు. ఆర్టీసి ఉద్యోగులు – 58 వేల మంది వీరంతా దశాబ్దాలుగా ఉద్యోగం చేస్తున్నారు. కోవిడ్ నియామకాలు – 26 వేలు. ఇవి తాత్కాలిక ఉద్యోగాలే. ఆప్కోస్ – 95 వేల మంది ఇందులో అత్యధికం మద్యం షాపుల్లో పని చేసే వారు. ఇవన్నీ తీసేస్తే నిజమైన అర్హులకు వచ్చిన ఉద్యోగాలు 15 వేల లోపే. అవి కూడా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కలిపి. ఉద్యోగాలు ఇచ్చింది లేకపోగా టిడిపి హయాంలో ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి యువనేస్తం 2వేల నిరుద్యోగ భృతి పథకాన్ని రద్దు చేసారని అన్నారు.

## ఏపీలో కొత్తగా 2,526 కరోనా కేసులు

అమరావతి: ఏపీలో గడిచిన 24 గంటల్లో 93,785 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. కొత్తగా 2,526 కరోనా కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో రాష్ట్రంలో కరోనా వైరస్ ప్రభావంతో 22 మంది మృతి చెందారు. తాజాగా 2,933 మంది కరోనా బాధితులు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఇక రాష్రంలో ఇప్పటి వరకు 2,33,14,697 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కాగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 18,93,498 మంది కరోనా బాధితులు కోలుకున్నారు. అంతేకాకుండా కరోనా మహమ్మారి బారినపడి మొత్తం 13,081 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో 25,526 పాజిటివ్ కేసులు ఉన్నాయి. ఇక రాష్రంలో ఇప్పటి వరకు 19,32,105 మంది కరోనా బారిన పడ్డారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ గురువారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.



# సంపాదకీయం

శుక్రవారం 16 జూలై 2021

## అస్త్ర, శస్త్రాలతో అధికార, ప్రతిపక్షాలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చే?కుంటున్నాయి. పార్లమెంట్ బయిట రైతులు సిద్ధమౌతుంటే.. లోపల అధికార ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రెడీ అవుతున్నాయి.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో అటు అధికార పక్షంలోనూ కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయి..మొన్నటి దాకా లీడర్ ఆఫ్ ది హౌజ్ గా వ్యవహరించిన బీజేపీ ఎంపీ తవర్ చంద్ గెహ్లాట్ ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించి, కర్ణాటక గవర్నర్ గా పంపారు. దీంతో ఖాళీ అయిన ఆ పదవిని మరో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ కు అప్పగించాలని బీజేపీ హైకమాండ్ దాదాపుగా నిర్ణయం తీసుకుంది. 2010 నుంచీ రాజ్యసభ ఎంపీగా కొనసాగుతోన్న గోయల్.. అటు ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కోవడంతోపాటు కీలకమైన అంశాల్లో వైసీపీ, అన్నాడీఎంకే, బీజేడీ లాంటి మిత్రులతో అనుకూలంగా ఓట్లేయించడం, మోదీ బద్ధ విరోధి మమతా బెనర్జీ పార్టీకి చెందిన ఎంపీలతో సైతం సఖ్యత కొనసాగించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గెహ్లాట్ నిష్క్రమణతో ఖాళీ అయిన రాజ్యసభ నాయకత్వ పదవికి గోయల్ పేరును అధిరాకికంగా వెల్లడించడమే తరువాయి అని ఢిల్లీ వర్గాలు పేర్కొన్నాయి. ఇక కరోనా విలయాన్ని నిర్వహించడంలో వైఫల్యం, రాఫెల్ కుంభకోణంపై కోర్టుల్లో విచారణ, అధిక ధరలు, పెట్రో మంటలపై సామాన్యుడి భగభగల నడుమ బీజేపీతోపాటు ప్రధాని నరేంద్ర మోదీ గ్రాఫ్ పడిపోతున్న క్రమంలో, తనదైన శైలినే కొనసాగిస్తూ నెమ్మదిగా గ్రాఫ్ పెంచుకుంటూ వచ్చారు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ. ఐఏసీసీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకుని అస్త్రసన్యాసం చేశారని ప్రత్యర్థులు విమర్శించినా పట్టించుకోని ఆయన మారిన పరిస్థితుల్లో తనతోపాటు పార్టీకీ కొత్త ఊపు ఇచ్చేలా కొత్త బాధ్యతలు స్వీకరించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నోట్ల రద్దు, జీఎస్టీ, రాఫెల్ కుంభకోణం లాంటి అంశాలపై కాంగ్రెస్ తొలి నుంచీ చేస్తోన్న వాదనకు గతంలో కంటే ఇప్పుడు మరింత బలం చేకూరడం, గడిచిన ఏడాదిన్నరగా దేశాన్ని పీడిస్తోన్న కరోనా మహమ్మారిని సరైన రీతిలో నిర్వహించడంలో మోదీ సర్కారు వైఫల్యం, నిత్యావసరాల ధరలు, పెట్రో మంటలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు పెల్లుబిగడం, ఏడు నెలలుగా రైతులు ఉద్యమిస్తుండటం తదితర పరిణామాలతో మోదీ సర్కారు దాదాపు డిఫెన్స్ లో పడిపోయిన స్థితిలో ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం, పార్లమెంటులో కేంద్రంపై ఇంకాస్త గట్టిగా పోరాడటం ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత హుషారు నింపొచ్చని, ఈ వర్షాకాల సమావేశాలు అందుకు చక్కటి అవకాశమని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.పార్లమెంటరీ వ్యవహారాలపై ఏర్పాటైన కేబినెట్ కమిటీ దీనికి సంబందించిన తేదీలు సిఫార్సు చేసింది.. సమావేశాలకు ఒక రోజు ముందు 18వ తేదీన అఖిలపక్షం సమావేశం నిర్వహిస్తారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి అధ్యక్షతన సమావేశం జరుగుతుంది.. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఫ్లోర్ లీడర్లతో సమావేశం నిర్వహిస్తారు. కొవిడ్-19 మహమ్మారిని దృష్టిలో పెట్టుకొని పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తామని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్, ప్రహ్లాద్ జోషి, అర్జున్ రామ్ మేఘవాల్‌తో పాటు 20 మంది వరకు బీజేపీ సీనియర్ నేతలు సమావేశమై చర్చించారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, కొవిడ్-19 మహమ్మారిపై కేంద్రాన్ని ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు సన్నద్ధం అవుతున్నాయి రాజ్యసభలో అధికార బీజేపీ మాదిరిగానే లోక్ సభలో విపక్ష కాంగ్రెస్ కు సైతం నాయకుడు కరువయ్యాడు. ఇన్నాళ్లూ లోక్ సభలో కాంగ్రెస్ పక్ష నేతగా వ్యవహరించిన అధిర్ రంజన్ చౌదరి పెద్దగా ఆకట్టుకోలేకపోవడం, బెంగాల్ పీసీసీ చీఫ్ గా ఉండటంతో ఆయను తప్పించి కొత్త నేతను నియమించాలని హైకమాండ్ భావించింది. అందుకోసం మనీశ్ తివారి, శశిథరూర్, ఉత్తమ్ కుమార్ రెడ్డిలాంటి పేర్లను సైతం పరిశీలించింది. అనూహ్య రీతిలో ఆ బాధ్యతను తీసుకునేందుకు రాహుల్ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి బాధ్యతగా పార్టీ అధ్యక్ష పదవిని వదులుకున్న రాహుల్ మళ్లీ రెండున్నరేళ్ల తర్వాత కీలక బాధ్యతలు చేపట్టనుండం కాంగ్రెస్ శ్రేణుల్ని ఉత్సాహపరుస్తుందని ఏఐసీసీ నేతలు చెబుతున్నారు. రాఫెల్ కుంభకోణం, కరోనా విలయం, నిరుద్యోగం.. ఈ మూడు అంశాలపై రాహుల్ గాంధీ చేస్తోన్న వాదనలకు ఇటీవల పెద్ద ఎత్తున స్పందన వస్తున్న దరిమిలా, మోదీకి పోటీగా రాహుల్ ను ఎస్టాబ్లిష్ చేసేందుకు ఇదే సరైన తరుణమని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

# కేతిరెడ్డి వర్సెస్ ప్రభాకరరెడ్డి

అనంతపురం, జూలై 15, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా అనగానే గుర్తుకు వచ్చే రాజకీయ కుటుంబం జేసీ ఫ్యామిలీ. ప్రభాకర్ రెడ్డి, దివాకర్ రెడ్డి సోదరుల రాజకీయం.. రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ తెలిసిందే. దాదాపు 40 ఏళ్ల పాటు తాడిపత్రిలో తిరుగులేని విజయాలు సొంతం చేసుకున్న సోదర ద్వయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే గత ఎన్నికల్లో ఇక్కడ తాడిపత్రి నుంచి వైసీపీ తరఫున కేతిరెడ్డి పెద్దారెడ్డి విజయం దక్కించుకు న్నారు. ఈ క్రమంలో ప్రభాకర్ వర్సెస్ పెద్దారెడ్డిల మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గుమనే రాజకీయాలు చోటు చేసుకున్నాయి. ఆధిపత్య రాజకీయాలకు కేంద్రంగా మారిన తాడిపత్రి కొన్ని రోజుల పాటు ప్రధాన వార్తగా మారింది. ఇక, పోలీసు కేసులు.. ఇతరత్రా కార్యక్రమాలతో ప్రభాకర్ కొన్ని రోజులు జైల్లో కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే పెద్దారెడ్డి ఆయన ఇంటికి వెళ్లిమరీ హెచ్చరికలు జారీ చేయడం కూడా అందరికీ తెలిసిందే. అయితే.. స్థానిక ఎన్నికల్లో తాడిపత్రి మునిసిపాలిటీలో ప్రభాకర్ రెడ్డి విజయం దక్కించుకున్నారు. ఏపీ మొత్తం మీద టీడీపీ గెలిచిన ఏకైక మున్సిపాల్టీ ఇదే..! తన విజయానికి జగన్ కారణమని.. ఆయన సహకరించకపోతే.. గెలుపుగుర్రం ఎక్కేవాడిని కాదని.. ప్రభాకర్ రెడ్డి బహిరంగంగానే వ్యాఖ్యానించారు. దీంతో ఇక, ఇరు పక్షాల మధ్య రగడ సడలిపోయిందని అందరూ అనుకున్నారు. కానీ, అనూహ్యంగా ఇప్పుడు మరో వివాదం తెరమీదికి వచ్చింది. దివాకర్, ప్రభాకర్‌రెడ్డి కుటుంబాల ఆధిపత్యంలో కొనసాగుతున్న ఓ ఆలయం విషయంలో పెద్దారెడ్డి వ్యూహాత్మకంగా వేసిన అడుగులు ప్రస్తుత తాడిపత్రిలో రగడకు కారణంగా కనిపిస్తున్నాయని అంటున్నారు పరిశీలకులు.తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామంలోని వజ్రగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఉంది. 1950 నుంచి ఈ ఆలయం జేసీ వర్గీయుల చేతుల్లో ఉంది. వారే కమిటీ మెంబర్లుగా ఉంటున్నారు. అయితే.. పెద్దారెడ్డి ఎమ్మెల్యే అయ్యాక జేసీ వర్గానికి చెక్ పెడుతున్నారు. ఈ క్రమంలోనే పెద్దారెడ్డి ఆ గుడిని దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చేశారు, ఇక, అప్పటి నుంచి ఆలయం అంతా దేవాదాయ శాఖ పరిధిలోనే ఉంది. జేసీ ఫ్యామిలీ పెత్తనం నామమాత్రంగా మారిపోయింది. దీంతో జేసీ వర్గం సహజంగానే ఆందోళనకు గురైంది.ఈ క్రమంలోనే తమ సత్తా చాటాలనుకున్న జేసీ వర్గం .. ఈ ఆలయంలో యాగం తలపెట్టింది. అయితే.. దీనికి అధికారులు అడ్డు చెప్పారు.జేసీ వర్గం యాగం తలపెట్టిన సమయంలోనే అధికారపార్టీ నాయకులు ఆలయంలో నియమితులైన కొత్త కమిటీ ద్వారా పూజలు చేయిస్తామని ప్రకటించారు. దీంతో ఇది మరింత వివాదానికి కారణంగా మారింది. జేసీ వర్సెస్ పెద్దారెడ్డి వర్గాలు ఆలయం విషయంలో పోటీ పడుతుండడం.. రాజకీయంగా తాడిపత్రిలో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోనని అధికారులు హడలి పోతున్నారు. ఈ క్రమంలోనే రెండు వర్గాలను ఆలయం చుట్టుపక్కలకు రాకుండా చర్యలు తీసుకున్నారు. అయితే.. రాజకీయంగా ఆధిపత్య ధోరణితో ముందుకు సాగుతున్న ఈ రెండు వర్గాలు ఎప్పుడైనా ఘర్షణకు దిగే ఛాన్స్ ఉందని అంటున్నారు పరిశీలకులు. మరి తాడిపత్రిలో ఎప్పుడు? ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# విశాఖ లో స్లీపర్ సెల్స్

విశాఖపట్టణం, జూలై 15, (న్యూస్ పల్స్)దేశం మీద ఉగ్ర కన్ను పడింది. అత్యాధునిక సాంకేతిక సంపత్తితో విరుచుకుపడేందుకు ఉగ్రవాదులు చూస్తున్నారు. దాయాది పాకిస్థాన్ ఆర్మీ ఉగ్రవాదులకు టెక్నాలజీ విషయంలో సాయం చేస్తోంది అన్న అనుమానాలూ ఉన్నాయి. వెనకాతల తోడేలు లాంటి చైనా తోడు కూడా ఉందని చెబుతారు. మొత్తానికి సరిహద్దుల్లో డ్రోన్ల దాడులు పెరిగాయి. వాటి ద్వారా బాంబు దాడులకు పాల్పడుతూ ఇండియాను అస్థిరపరచాలన్నది ఉగ్ర మూకల స్ట్రాటజీ. ఈ విషయంలో భారత సైన్యం అప్రమత్తమైనప్పటికీ యాంటీ డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారానే వీటికి అడ్డుకట్ట పడుతుందని దౌత్య రంగ నిపుణులు చెబుతున్నారు.ఉమ్మడి ఏపీలో హైదరాబాద్, విశాఖపట్నాలను వ్యూహాత్మకమైన ప్రాంతాలుగా రక్షణ రంగ నిపుణులు పేర్కొనేవారు. దాదాపుగా కోటి మంది జనాభా నివసించే భాగ్యనగరంలో ఉగ్ర ముప్పు ఎపుడూ పొంచి ఉంటూనే ఉంది. స్లీపింగ్ సెల్స్ అక్కడ అడుగడుగునా ఉన్నాయన్న అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మాలిక్ బ్రదర్స్ ఆసిఫ్ నగర్ లో అరెస్ట్ కావడం, దర్భంగా పార్సిల్ బాంబు లింక్స్ మూలాలు ఇక్కడివే అని తేలడంతో హైదరాబాద్ మరోమారు ఉలిక్కిపడుతోంది. ఈ రోజున అన్ని రకాలుగా హైదరాబాద్ విస్తరించి ఉంది. దాంతో ఉగ్ర అలజడికి అది ఒక వ్యూహాత్మకమైన ప్రాంతంగా రక్షణ రంగం అనుమానిస్తోంది. ఆ తరువాత జాబితాలో విశాఖ పేరు కూడా ఉందిట.హైదరాబాద్ తరువాత విశాఖ పేరే నాడూ చెప్పేవారు. పాతిక లక్షల పై దాటిన జనాభాతో మినీ ఇండియాగా విశాఖ ఉంది. ఇక్కడ తూర్పు నావికా దళంతో పాటు అనేక కీలకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్నాయి. ఇక ఉగ్ర కన్ను ఇటు వైపుగా కూడా ఉంటుందని అనుమానాలు ఉన్నాయి. 1971లో పాకిస్థాన్ సైన్యం విశాఖ మీదుగా దూసుకువచ్చిన ఘటన కూడా ఉంది. సముద్రతీర ప్రాంతం కావడంతో ముంబై తరువాత విశాఖ మీద అటెన్షన్ ఉంటుందని అంటారు. ఇక విభజన ఏపీలో నాటి చంద్రబాబు సర్కార్ విశాఖను ఆర్ధిక రాజధానిగా ప్రకటిస్తే నేటి జగన్ ప్రభుత్వం ఏకంగా పాలనా రాజధానిని చేసింది. దాంతో విశాఖకు రాజకీయంగా కూడా ప్రాముఖ్యత బాగా పెరిగింది.

దేశంలో ఎక్కడ ఉగ్ర తాకిడి కనిపించినా విశాఖ కూడా దానికి అనుగుణంగా అలెర్ట్ అవుతుంది. విశాఖలో రక్షణ రంగ విభాగాలు కూడా ఉండడంతో అంతా అలెర్ట్ అవుతారు. ప్రస్తుతం కూడా విశాఖ అప్రమత్తమవుతోంది. ఉగ్ర దాడులు కానీ, మరే రకమైన అలజడులు కానీ సంభవించే అవకాశాలు ఎక్కువగా ప్రధాన నగరాలలోనే ఉంటాయి. దాంతో స్ట్రాటజిక్ స్పాట్ గా విశాఖను కూడా రక్షణ రంగం భావిస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖలోనూ అనుమానితిల కదలికలపైన ఆరాలు మొదలయ్యాయి. ఏది ఏమైనా కూడా ఉగ్ర ముప్పు అన్నది ఎటు నుంచి ఎటైనా ఉంటుంది కాబట్టి విశాఖ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ రంగ నిపుణులు కూడా సూచిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో హైదరాబాద్, విశాఖ రెండూ కూడా ఎపుడూ అప్రమత్తంగానే ఉండాలన్నది వారి ఆలోచన.

# ఇక టీడీపీ దూకుడు....

గుంటూరు, జూలై 15, (న్యూస్ పల్స్)ప్రధాన ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత చంద్రబాబు దూకుడు పెంచారు. గతానికి భిన్నంగా ఆయన నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఈ ఒక్క విషయంలో చంద్రబాబు చాలా స్పీడ్‌గా తీసుకుంటోన్న నిర్ణయాలతో పార్టీ నేతలే అవాక్కవ్వడంతో పాటు చంద్రబాబు మారర్రా బాబు అని చర్చించుకుంటున్నారు. అసలు మ్యాటర్‌లోకి వస్తే గత ఎన్నికల్లో చాలా నియోజకవర్గాల్లో పార్టీ ఓడిపోయింది. దీంతో ఓడిపోయిన వారు చాలా మంది దూరంగా ఉంటున్నారు. కొందరు పార్టీ మారి వైసీపీలోకి.. బీజేపీలోకి కూడా జంప్ చేశారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఇంచార్జ్‌లు లేకుండా పోయారనే వాదన తెలిసిందే. కొద్ది రోజుల వరకు ఉన్న నివేదికల్లో పార్టీకి ఏపీలో ఉన్న 175 నియోజకవర్గాల్లో 30 కు పైగా నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లు లేని పరిస్థితి.అయితే..అదే సమయంలో తమకు పగ్గాలు అప్పగిస్తే.. పార్టీని పరుగులు పెట్టిస్తామంటూ.. కొందరు యువ నాయకులు, ఎన్నారైలు అనేక మార్లు విన్నవించినా చంద్రబాబు పెద్దగా పట్టించుకోలేదు. నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేల సీట్లు ఇచ్చే విషయంలో చంద్రబాబుకు నాన్చడం ఎప్పుడూ ఉన్న అలవాటే. ఈ విషయంలో ఎప్పుడూ సరైన డెసిషన్లు తీసుకోకపోవడంతోనే పార్టీని వీడి చాలా మంది నేతలకు బయటకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి.. పార్టీ చాలా నియోజకవర్గాల్లో దెబ్బలు తింది. దీంతో చంద్రబాబు నిర్ణయం ఒక జీవితకాలం లేటు..! అనే వ్యాఖ్యలు వినిపించాయి. అయితే గతానికి భిన్నంగా ఇప్పుడు చంద్రబాబు ఆలోచిస్తున్నారు. తాజాగా మారుతున్న పరిణామాలు.. వైసీపీ దూకుడు నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం దక్కించుకునేందుకు ఇప్పటి నుంచి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు గ్రహించినట్టు కనిపిస్తోంది.అందుకే ఆయన క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేదిశగా అడుగులు వేశారు. ఈ క్రమంలోనే ఇన్‌చార్జ్‌లు లేకుండా ఖాళీగా ఉన్న పలు నియోజకవర్గాలకు ఇంచార్జ్‌లను నియమించారు. మరీ ముఖ్యంగా అనంతపురం జిల్లాలో సీనియర్ టీడీపీ కుటుంబం పరిటాల ఫ్యామిలీ ఎప్పటి నుంచో కోరుతున్న రెండు నియోజకవర్గాలను అప్పగించేశారు. రాప్తాడును మాజీ మంత్రి సునీతకు, ధర్మవరం నియోజకవర్గాన్ని పరిటాల శ్రీరాంకు అప్పగించేశారు చంద్రబాబు. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. విశాఖపట్నం జిల్లాలోకీలక నియోజకవర్గం భీమిలి ఇంచార్జ్‌గా కోరాడ రాజాబాబును నియమించారు. ఇక్కడ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన సబ్బం హరి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.ఇక, ప్రకాశం జిల్లా దర్శి ఇంచార్జ్‌గా పమిడి రమేష్‌కు అవకాశం ఇచ్చారు. ఇక్కడ మాజీ మంత్రి శిద్దా రాఘవరావు.. వైసీపీలో చేరిన విషయం తెలిసిందే. గుంటూరు జిల్లా మాచర్లలో మాజీ ఇన్‌చార్జ్ చలమారెడ్డికి ఛాన్స్ ఇచ్చారు. అదేవిధంగా ఇప్పటి వరకు త్రిశంకు స్వర్గంగా ఉన్న కృష్ణాజిల్లా తిరువూరు నియోజకవర్గాన్ని..ఎన్నారై సామల దేవదత్తకు అప్పగించారు. ఏలూరును మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సోదరుడు బడేటి చంటికి ఇచ్చారు. కొవ్వూరును మాజీ మంత్రి జవహర్‌కే ఇచ్చేలా లైన్ క్లియర్ చేశారు. చింతలపూడిని మళ్లీ మాజీ మంత్రి పీతల సుజాతకే ఇస్తానని హామీ ఇచ్చేశారు. ఇలా మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీకి ఇంచార్జ్‌లను నియమించే కార్యక్రమాన్ని చంద్రబాబు వేగవంతం చేశారు. దీని ప్రకారం వచ్చే దసరా నాటికే ఈ నియామకాలు పూర్తి చేసి.. పార్టీని పరుగులు పెట్టించాలనేది చంద్రబాబు వ్యూహంగా ఉందని అంటున్నారు పార్టీ సీనియర్లు.

# నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు 5వ షెడ్యూల్ లో చేర్చడానికి ప్రణాళిక

విశాఖపట్నం జూలై 15, (న్యూస్ పల్స్)గిరిజన ప్రాంతాల్లో50% కంటే ఎక్కువ గిరిజన జనాభా కలిగి నాన్-షెడ్యూల్ ప్రాంతాల్లో గల గ్రామాలకు 5వ షెడ్యూల్ లో కల్పడానికి సంబంధించిన సమావేశం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి రొణంకి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో పాల్గోన్న అరకు నియోజకవర్గ శాసనసభ్యుడు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా నాన్-షెడ్యూల్ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు తమకు 5వ షెడ్యూల్ లో కలిపి, అక్కడున్న గిరిజనులకు ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలను తమకు కూడా వర్తించేలా చేయాలని పలుమార్లు వేడుకోవడం జరిగిందని, వారి కల త్వరలోనే నెరవేరబోతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా నాన్-షెడ్యూల్ ప్రాంతాల్లో ఉంటున్న ఎన్నో గిరిజన కుటుంబాలు, అభివృద్ధి లో ఎంతో వెనుకబడి ఉన్నారని, ఈ విషయాన్ని వైసీపీ ప్రభుత్వంలో తీరుతుండటం ఎంతో ఆనందింపదగ్గ విషయమని ఆయన అన్నారు. ఐటీడీఏ పీఓ రోణంకి గోపాల కృష్ణ మాట్లాడుతూ గిరిజనుల కొరకు భారత రాజ్యాంగం లో 5వ, షెడ్యూలు ఏర్పాటు చేసి,వారికి ప్రత్యేక హక్కులు కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. నాన్ షెడ్యూల్ లో ఉన్న గిరిజన గ్రామాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం ఆ గ్రామాల్లో ఉన్న జనాభా మొత్తంలో 50% పైబడి గిరిజన జనాభా కలిగిన గ్రామాలకు 5వ, షెడ్యూలులో చేర్చడానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి త్వరలోనే సమర్పిస్తామని అన్నారు. పైన తెలుపబడిన విధముగా అర్హత కలిగిన గ్రామాలను గుర్తించి, ఆ గ్రామాల పరిధిలో, గ్రామసభలను నిర్వహించి, గ్రామసభ తీర్మాణమును తక్షణమే తమ కార్యాలయము నకు సమర్పించాలని, నాన్-షెడ్యూల్ మండల అభివృద్ధి

**దశాబ్దాలకాల ఎదురు చూపులకు పరిష్కారమార్గం**

**అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ**

అధికారులకు, తహసీల్దార్ లకు ఆయన ఆదేశించారు. ఈ ప్రతిపాదనలు జూలై 23న జరుగనున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహామండలి సమావేశంలో ప్రవేశ పెట్టి, తుది నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఈ సమావేశంలో పాడేరు ఎమ్మెల్యే: కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, సబ్ కలెక్టర్: బి.అభిషేక్, నర్సీపట్నం ఆర్.డి. ఓ: అనిత, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి: వి.ఎస్ ప్రభాకర్, మరియు నాన్-షెడ్యూల్ మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇక సచివాలయాలు ముగిసినట్టేనా

విజయవాడ, జూలై 15, (న్యూస్ పల్స్)జగన్ మనసులో పుట్టిన గొప్ప ఆలోచన గ్రామ సచివాలయాలు అని వైసీపీ నేతలు చెబుతారు. కానీ ఏ వ్యవస్థ అయినా రాజ్యాంగబద్ధంగానే ఉండాలి. అంతే కాదు, అవి మరో వ్యవస్థలో చొచ్చుకుపోరాదు. అధికారాలు నిండా లాగేసుకోరాదు. కానీ చూడబోతే గ్రామ సచివాలయాలు కచ్చితంగా పంచాయతీల పునాదులను పెకిలించేలాగానే ఉన్నయి. గ్రామ పంచాయతీల పాలన అయిదారు వందల జనాభా నుంచి మొదలవుతుంది. ఒక విధంగా చెప్పాలంటే ప్రజలకు ఇంత దగ్గరగా పాలన చేసే మరో వ్యవస్థ లేదు. అలాగే పంచాయతీఅలోని వార్డు మెంబర్లు ఉన్నారంటే వారు ప్రతీ యాభై మందికి ప్రతినిధులుగా వ్యవహరిస్తారు.గ్రామాలలో కొత్తగా వచ్చిన సచివాలయాలు సమాంతరంగానే ఉన్నాయని చెప్పాలి. ఇక్కడ కూడా ప్రతీ యాభై కుటుంబాలకు ఒక వాలంటీర్ ని నియమిస్తున్నారు. ఆ వాలంటీర్ కూడా ప్రజల బాగోగులు చూడడానికే అంటున్నారు. మూడేళ్ళుగా పంచాయతీలకు ఎన్నికలు లేవు కాబట్టి సచివాలయాల హవా సాగింది. ఇపుడు పంచాయతీలకు కొత్త పాలక వర్గాలు వచ్చేశాయి. వాటి పాలన సాగాలి అంటే సచివాలయ వ్యవస్థ అడ్డుపడుతోంది అంటున్నారు. చాలా వరకూ ఇది నిజమే అంటున్నారు. ఎందుకంటే ఇద్దరూ ఒకే పని చేస్తే అక్కడ ఘర్షణకే ఆస్కారం ఉంటుంది.మరో వైపు చూస్తే జీవో నంబర్ 2 అంటూ వైసీపీ సర్కార్ గ్రామ సచివాలయ వీయార్వోలకు కొన్ని పంచాయతీ పవర్లను కట్టబెట్టింది. వారంతా కోర్టుకు వెళ్లాక కోర్టు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. జీవోను కూడా సస్పెండ్ చేసింది. పైగా పంచాయతీల అధికారాలు, హక్కులను హరాయించేదిగా కూడా భావిస్తున్నారు. సంక్షేమ పథకాలను గ్రామ పంచాయతీల ద్వారానే ఇవ్వవచ్చు కదా అని కోర్టు ప్రశ్నించడం చూస్తూంటే సచివాలయాలకు మూడినట్లే కనిపిస్తోంది.ఒక వైపు రాజ్యాంగ వ్యవస్థలుగా పంచాయతీలు ఉన్నాయి. మరో వైపు వైసీపీ తెచ్చిన సచివాలయాలు ఉన్నాయి. పంచాయతీ అధికారాలకు కోత వేసేలా కొత్త వ్యవస్థ రూపకల్పన ఉందని అభిప్రాయం వస్తోంది. అయితే అలాంటిదేమీ లేదని, ఎవరి పని వారిదే అని వైసీపీ మంత్రులు అంటున్నారు. తాము సచివాలయాలను కొనసాగించి తీరుతామని చెబుతున్నారు. అయితే ఇప్పటికే సచివాలయాల మీద ఘాటు వ్యాఖ్యలు చేసిన హై కోర్టు తుది తీర్పు ఏ విధంగా ఇస్తుంది అన్నది ఆసక్తికరంగా ఉంది. అయితే సచివాలయాలు వైసీపీకి రాజకీయంగా పదునైన ఆయుధంగా ఉన్నాయి. కాబట్టి ఇప్పటిలో ఈ పంచాయతీ తేలే చాన్స్ లేదు అంటున్నారు.

## ఆగమ్య గోచరంగా వైవీ సన్ స్ట్రోక్స్

ఒంగోలు, జూలై 15, (న్యూస్ పల్స్)వైసీపీ కీలక నాయకుడు, సీఎం జగన్‌కు స్వయానా చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి అంతర్మథనంలో కూరుకుపోయారు. తన కుమారుడు.. విక్రాంత్‌రెడ్డి దూకుడుతో ఆయనకు రాజకీయ చిక్కులు వచ్చిపడ్డాయి. విశాఖలో బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి పెద్ద ఎత్తున మీడియాలో వస్తున్న వార్తలతో.. కేంద్రంలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ తీవ్రంగా స్పందించింది. ముఖ్యంగా అటవీ ప్రాంతాన్ని నరికేయడం.. రోడ్లు వేయడం.. వంటి పరిణామాలు.. తీవ్రంగా మారుతున్నాయి. మరోవైపు.. సీఎం జగన్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నారని.. పార్టీ పెద్దలే చెబుతున్నారు.దీంతో వైవీ సుబ్బారెడ్డి కి ఇప్పుడు ఊపిరి సలపడం లేదట. ఇటీవల టీటీడీ చైర్మన్ పదవి కూడా పోవడం.. దీనిని రెన్యువల్ చేయకుండా జగన్ పక్కన పెట్టడానికి కూడా ఇదే పెద్ద కారణమనే ప్రచారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇక ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఉబలాట పడుతున్నారు. వైవీ సుబ్బారెడ్డిరా రాజ్యసభ ఇచ్చే పరిస్థితి లేదు. ఇటు ఎమ్మెల్సీ కూడా కష్టమే అని తెలుస్తోంది. ఇక విశాఖ ప్రాజెక్టుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినా.. ప్రభుత్వ పరిధి దాటి తవ్వకాల కోసం ప్రయత్నాలు చేశారని అంటున్నారు. ఈ పరిణామం.. వైసీపీ వ్యతిరేక మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చేలా చేసింది.దీనిని సుమోటోగా పరిగణించిన హరిత ట్రిబ్యునల్ కేసు నమోదుకు అధికారులను ఆదేశించింది. దీంతో వైవీ సుబ్బారెడ్డి రాజకీయ పరిస్థితిపైనా నీలినీడలు కమ్ముకుంటున్నాయని అంటున్నారు. వాస్తవానికి టీటీడీ బోర్డును మరోసారి ప్రక్షాళన చేసి.. వైవీనే చైర్మన్‌గా నియమిస్తారని అందరూ అనుకున్నారు. కానీ, ఇప్పుడు జగన్ ఆయన పేరును పక్కన పెట్టి మేకపాటి పేరును పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు.. పార్టీలో ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పటికీ.. ఆయనకు ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగించిన రెండు జిల్లాల్లో తూర్పుగోదావరి బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించేందుకు కూడా రెడీ అయ్యారని అంటున్నారు.ఈ పరిణామాలతో వైవీ సుబ్బారెడ్డి భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. పార్టీలో నెంబర్ 2 లేదా 3గా ఇప్పటి వరకు చలామణి అయిన.. వైవీ సుబ్బారెడ్డి తన కుమారుడు దూకుడు కారణంగా ఎసరు తెచ్చుకున్నారని.. పార్టీలో తీవ్ర చర్చ సాగుతుండడం గమనార్హం. ఇక ఆయన సొంత జిల్లా ప్రకాశంలోనూ ఆయన మాట ఏ మాత్రం చెల్లుబాటు కావడం లేదు. చివరకు వైవీ సుబ్బారెడ్డి తన మునుపటి ప్రభావం కోసం విజయమ్మతో జగన్ దగ్గర లాబీయింగ్ స్టార్ట్ చేశారట. మరి ఇది ఎంత వరకు ఫలిస్తుందో ? చూడాలి.

# వామపక్ష నేతలు ఆరెస్టు

విజయవాడ జూలై 15, (న్యూస్ పల్స్ ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను పెంపు, చెత్త పన్ను కు నిరసనగా విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం, సిపిఐ కార్యకర్తలను పోలీసులు అరెస్టులు చేసారు. సిపిఎం నేతలు సిహెచ్ బాబూరావు, డి.కాశీనాథ్ బి.రమణ రావు, జి.ఆదిలక్ష్మి, సూరిబాబు కృష్ణ, శ్రీనివాస్, సీపీఐ నేత డి.శంకర్ తదితరులను అరెస్టు చేసి కృష్ణలంక, గవర్నర్ పోలీస్ స్టేషన్లో ఉంచారు. గత రాత్రి నుండి పలువురు నేతలను గృహనిర్బంధం చేస్తూ నోటీసులు జారీ చేసారు. కౌన్సిల్లో చెత్త పన్ను ను ఆమోదిస్తే ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని వామపక్ష నేతలు హెచ్చరించారు. అక్రమ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## 2024పై విజయసాయి, షర్మిల ప్రభావం.....



విశాఖపట్టణం, జూలై 15, (న్యూస్ పల్స్)గత ఎన్నికల్లో జగన్ అధికారంలోకి రావడానికి అనేక కారణాలున్నాయి. అందులో జగన్ శ్రమ ఒకటి కాగా, విజయసాయిరెడ్డి, వైఎస్ షర్మిల కూడా జగన్ విజయంలో ప్రధాన పాత్ర పోషించారనే చెప్పాలి. అయితే వచ్చే ఎన్నికల నాటికి వీరిద్దరే జగన్ కు రాజకీయంగా ఇబ్బందిగా మారారన్న టాక్ పార్టీ నుంచే విన్పిస్తుంది. ఈ ఇద్దరి వల్ల జగన్ కు రానున్న ఎన్నికల్లో నష్టం జరుగుతుందన్న అంచనాలు మాత్రం విన్పిస్తున్నాయి.వైఎస్ షర్మిల తన అన్న జగన్ అధికారంలోకి రావడానికి తీవ్రంగా శ్రమించారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి వాతావరణాన్ని జగన్ కు అనుకూలంగా మలిచారు. చంద్రబాబును బద్నాం చేయడం, యువతను ఆకట్టుకోవడంతో జగన్ విజయం మరింత సులభమయింది. అయితే ఇప్పుడు అదే వైఎస్ షర్మిల జగన్ కు ఇబ్బందిగా మారారు. జగన్ కు, షర్మల కు మధ్య అభిప్రాయ బేధాలు వచ్చినట్లు స్పష్టంగా తెలుస్తోంది.తెలంగాణలో పార్టీ పెట్టిన షర్మిల ఏపీలో ఉన్న జగన్ కు ఇబ్బందిగా మారారు. నీటి పంపకాల విషయంలో తెలంగాణ స్టాండ్ తీసుకోవడంతో జగన్ ను ఇరకాటంలోకి నెడుతుంది. వైఎస్ కుటుంబంలో విభేదాలని, ఇద్దరూ డ్రామా ఆడుతున్నారని విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఇది జగన్ కు వచ్చే ఎన్నికల్లో కొంత మైనస్ అవుతుందన్నది విశ్లేషకుల అంచనా. ముందుగా తెలంగాణ ఎన్నికలు పూర్తయిపోతాయి కాబట్టి, అప్పటికి రాజకీయ మార్పులు ఎలా ఉంటాయో చూడాలి.ఇక విజయసాయి రెడ్డి వైసీపీ విపక్షంలో ఉన్నప్పుడు కీలకంగా వ్యవహరించారు. జగన్ కు కుడిభుజంగా వ్యవహరించారు. టీడీపీ, బీజేపీని విడగొట్టడంలో ఆయన ముఖ్య పాత్రధారి. ట్విట్టర్ లో తన కామెంట్స్ తో చంద్రబాబును నిత్యం ఒక ఆటాడుకునే వారు. కానీ అదే విజయసాయిరెడ్డి కారణంగా ఇప్పుడు పార్టీకి నష్టం జరుగుతుందంటున్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో మాన్సాస్ ట్రస్ట్ వ్యవహారం పార్టీని ఇబ్బందుల్లో పడేసిందని చెబుతున్నారు. మొత్తం మీద వచ్చే ఎన్నికల్లో జగన్ కు ఈ ఇద్దరి వల్ల ముప్పు తప్పదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

## మేయర్లకు కలిసి రాని కాలం

విజయవాడ, జూలై 15, (న్యూస్ పల్స్)విజయవాడ నగరపాలక సంస్థకు సుదీర్ఘ చరిత్ర ఉంది. అయితే ఇక్కడ కార్పొరేటర్లుగా చేసిన వాళ్లు ఎమ్మెల్యేలు అయ్యారు. కానీ మేయర్లుగా పనిచేసిన వారు మాత్రం రాజకీయంగా ఎదుగుదల లేదు. ఈ సెంటిమెంట్ మాత్రం విజయవాడ నగరపాలక సంస్థ మేయర్లను వెంటాడుతూనే ఉంది. మేయర్ పదవి చేపట్టారంటే వారి రాజకీయ ప్రస్థానం అంతటితో ముగిసినట్లేనన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో బాగా విన్పిస్తుంది. ఒకప్పుడు రాజకీయ రాజధానిగా ఉన్న బెజవాడ మేయర్లకు మాత్రం పదోన్నతి దక్కలేదు.విజయవాడ నగర పాలకసంస్థ 1981లో ఏర్పడింది. అప్పటి నుంచి అనేక మంది మేయర్లుగా పనిచేశారు. జంధ్యాల శంకర్, టి. వెంకటేశ్వరరావు వంటి ప్రముఖ నేతలు మేయర్లుగా పనిచేశారు. విజయవాడ తూర్పు (అప్పటి) నియోజకవర్గంలో బ్రాహ్మణ సామాజికవర్గం ఓట్లు ఎక్కువ. అయినా ఇక్కడ నుంచి జంధ్యాల శంకర్ పోటీ చేసి చట్ట సభలకు వెళ్లలేదు. ఆయనకు విజయవాడ నగరంలో మంచిపేరున్నా రాజకీయంగా మేయర్ పదవితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.ఇక టి.వెంకటేశ్వరరావు మేయర్ గా పనిచేసి నగర ప్రజల మన్ననలను పొందరు. సీపీఐకి చెందిన టి.వెంకటేశ్వరరావు మేయర్ గా అవినీతి రహిత పాలన అందించారు. రెండుసార్లు మేయర్ గా ఎన్నికైన టి.వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా మాత్రం పదోన్నతి పొందలేకపోయారు. అప్పట్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీపీఐకి స్ట్రాంగ్ గా ఉండేది. కానీ ఇక్కడ నుంచి గెలిచి టి.వెంకటేశ్వరరావు శాసనసభ్యుడు కాలేకపోయారు. మేయర్ పదవితోనే సర్దుకోవాల్సి వచ్చింది.ఆ తర్వాత పంచుమర్తి అనురాధ టీడీపీ మేయర్ గా ఎన్నికయ్యారు. ఐదేళ్లు మేయర్ గా పనిచసిన అనూరాధ టీడీపీలో నేటికీ కొనసాగుతున్నా ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పదోన్నతిని పొందలేక పోయారు. ఆ తర్వాత మేయర్ పదవిని చేపట్టిన కోనేరు శ్రీధర్ మేయర్ తోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ చరిత్రను చూస్తే మేయర్ గా బాధ్యతలను చేపట్టిన వారు మాత్రం రాజకీయంగా ఎదగలేకపోయారు. కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పనిచేసిన వంగవీటి రంగా, సుబ్బరాజు వంటి వారు మాత్రం ఎమ్మెల్యేలు కావడం విశేషం.

### పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీగా రాహుల్ దేవ్ శర్మ

ఏలూరు జూలై 15, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీగా రాహుల్ దేవ్ శర్మ గురువారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అయనకు పోలీసు అధికారులు, వేద పండితులు, వేద మంత్రాలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత అయన మాట్లాడుతూ సాధారణ బదిలీలు భాగంగా పశ్చిమగోదావరి జిల్లా లో పని చేయడానికి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, డిజిపి గౌతమ్ సావాంగ్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలోని శాంతి భద్రతల పరిరక్షణ కొరకు ప్రాధాన్యత క్రమంలో మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తామని అన్నారు. జిల్లా లో పని చేస్తున్న అధికారుల సమన్వయంతో మహిళా చట్టాల అమలును పటిష్టంగా అమలచేస్తామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ దర్యాప్తులలో పురోగతిని సాధిస్తామని అన్నారు. సిబ్బంది సంక్షేమం పట్ల అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటి కప్పుడు సిబ్బంది యొక్క అవసరాలను తీరుస్తామని అన్నారు.నూతన ఎస్పీని జిల్లా అదనపు ఎస్పీ ఏవి సుబ్బరాజు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ సి జయ రామరాజు, ఏఆర్ అదనపు ఎస్పీ రామకృష్ణ, ఏలూరు డి ఎస్ పి డాక్టర్ దిలీప్ కిరణ్, కొవ్వూరు డి ఎస్ పి బి. శ్రీనాథ్, నరసాపురం డిఎస్పి వీరాంజనేయ రెడ్డి, జంగారెడ్డిగూడెం డిఎస్పి డాక్టర్ రవికిరణ్, పోలవరం డిఎస్పి లత కుమారి, ఏఆర్ డీఎస్పీ కృష్ణంరాజు, ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పి సుబాకర్, శ్రీనివాస రావు, దిశ పోలీస్ స్టేషన్ డిఎస్పి కె వి సత్యనారాయణ, సిసిఎస్ డిఎస్పి పైడేశ్వరరావు గారు ఎస్బి, సిఐ సిహెచ్ కొండలరావు, ఏలూరు వన్ టౌన్ సీఐ, వై.బి.రాజాజీ, ఏలూరు టూ టౌన్ సిఐ ఆది ప్రసాద్, త్రీటౌన్ సీఐ వరప్రసాద్, బి సి ఆర్ బి సి ఎం ప్రసాద్, డి టి సి సి ఐ రామారావు, ఏ.అర్ అర్. ఐ లు, కృష్ణంరాజు, మనోహర్, అంకమ్మరావు, పోలీస్ అధికారులు సంఘం అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు, బండారు నాని యు.ఎస్ అధికారుల సంఘం సభ్యులు ఎస్పిలు పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలను తెలియజేశారు

# మళ్లీ వాయిదా పడ్డ టిడ్కో గృహాలు

విజయవాడ, జూలై 15, (న్యూస్ పల్స్)టిడిపి హయాంలో నిర్మాణాలు ప్రారంభమైన టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఇప్పటికీ పంపిణీ చేయకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం అరకొరగా విడుదల చేస్తున్న నిధులను పరిశీలిస్తే ఇప్పట్లో లబ్ధిదారులకు టిడ్కో గృహాలు దక్కే పరిస్థితి లేకుండా పోతుందనే అభిప్రాయానికి బలం చేకూరుతోంది. లబ్ధిదారుల సొంతింటి కల ఏళ్ల తరబడి నెరవేరకపోవడంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న లబ్ధిదారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో 3,13,832 గృహాలు గ్రౌండింగ్ చేయగా, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనర్హులని పేర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందిని అర్హుల జాబితా నుంచి తొలగించారు. మిగిలిన 2,62,216 గృహాల జాబితాను అర్హులుగా ప్రకటించారు. ఇప్పటికి పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లు కేవలం 85 వేలు మాత్రమే. మరో 95 వేల ఇళ్లు సివిల్ పనులు పూర్తయినప్పటికీ ఇంటీరియర్ పనులు పూర్తికాలేదు. మిగిలిన 74,312 గృహాలు బేస్మట్టం లెవెల్లో నిర్మాణాలు ఉన్నాయి. టిడ్కో ప్రాజెక్టు మొత్తం విలువ రూ.22 వేలకోట్లు కాగా, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.4 వేల కోట్లు, లబ్ధిదారుని వాటా రూ.4 వేల కోట్లు, మిగిలిన రూ.14 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలు పూర్తికావాలంటే సుమారు రూ.12 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.అమరావతి రాజధాని ప్రాంతంలో టిడ్కో నిర్మించిన గృహాలకు మౌలిక వసతులు, రవాణా, తాగునీరు లాంటి కనీస సదుపాయాలు కల్పించేందుకు రూ.42 కోట్లు అవసరమని ప్రభుత్వ గణాంకాలు సూచిస్తున్నాయి. రాష్ట్ర మౌలిక వసతులు (ఇన్ఫ్రాస్ట్రక్చర్) కల్పిస్తే ఐదు వేల గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా లబ్ధిదారులకు కేవలం అలాట్మెంట్ పత్రం మాత్రమే ఇచ్చిన ప్రభుత్వం ఇళ్ల స్వాధీనానికి ముందుకు రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజధాని ప్రాంతమంతా సిఆర్డిఎ పరిధిలో ఉండటం, ఆ చట్టం నేడు కోర్టు పరిధిలో ఉండటం కూడా మౌలిక వసతులు కల్పించకపోవడానికి కారణమై ఉండొచ్చని పలువురు భావిస్తున్నారుపట్టణ ప్రాంతాల్లో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు బ్యాంకు రుణాల రద్దు ప్రక్రియ నూరుశాతం పూర్తికాకపోవడంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ ఇళ్లకు సంబంధించి బ్యాంకు రుణాలు లబ్ధిదారుడు చెల్లించకుండా ప్రభుత్వమే రుణాన్ని చెల్లించి, రూ.1కే లబ్ధిదారుని ఇంటిని అప్పజెబుతుందని ప్రకటించారు. ఈ ప్రక్రియ నేటికీ నూరుశాతం పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 3 వేల గృహాలకు సంబంధించి

బ్యాంకుల నుంచి రూ.92 కోట్లు రుణాలుగా తీసుకున్నట్లు తెలిసింది. వడ్డీతో కలిపి నేటి వరకు ఈ రుణం మొత్తం రూ.100 కోట్లకు చేరినట్లు అంచనా. ఇందులో రుణాలకు సంబంధించి ప్రభుత్వం రూ.50 కోట్లు మాత్రమే జమ చేసినట్లు సమాచారం.365, 430 చదరపు అడుగుల్లో నిర్మిస్తున్న టిడ్కో గృహాలకు లబ్ధిదారుని వాటా కింద చెల్లించిన నగదును 50 శాతానికి కుదించిన ప్రభుత్వం ఆ నగదును వెనక్కి ఇవ్వలేదని తెలిసింది. రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదారునికి రూ.25 వేలు, లక్ష చెల్లించిన లబ్ధిదారుని వాటా రూ.50 వేలకు ప్రభుత్వం కుదించిన సంగతి పాఠకులకు విధితమే. ఈ విధంగా చెల్లించాల్సిన నగదు సుమారు రూ.500 కోట్లు వరకు ఉండొచ్చని అంచనా. అనర్హులంటూ జాబితా నుంచి తొలగించిన 50 వేల మందికి సంబంధించి వారు చెల్లించిన వాటా రూ.65 కోట్ల వరకు పెండింగ్లోనే ఉంది. లబ్ధిదారుని వాటా ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. నిధుల లేమితో అల్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్లు లబ్ధిదారుని వాటా తాము చెల్లించే పరిస్థితిలో లేమని, ప్రభుత్వమే నిధులు సమకూర్చాలని కోరినట్లు సమాచారం.

# ప్రతి భక్తుడిలో భగవంతుని చూడండి

### నూతన ఉద్యోగులకు టీటీడీ జె ఈవో సదా భార్గవి పిలుపు

తిరుపతి, జూలై 15 శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కరుణతో ఉద్యోగాలు పొందిన మీరు ప్రతి భక్తుడిలో భగవంతుని చూస్తూ సేవ చేయాలని టీటీడీ జెఈవో సదా భార్గవి పిలుపునిచ్చారు. టీటీడీ లో ఒకే సారి కారుణ్య నియామకాలు పొందిన 119 మంది ఉద్యోగుల కు గురువారం శ్వేత లో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జెఈవో సదా భార్గవి ఈ శిక్షణ కార్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శ్రీ వేంకటేశ్వర స్వామి కల్పించిన ఈ అదృష్టాన్ని ఉద్యోగంగా కాకుండా స్వామి ఇచ్చిన సేవా భాగ్యంగా చూడాలన్నారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ,నిబద్ధత, చిత్తశుద్ధితో పని చేస్తూ, ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ధార్మిక సంస్థ అయిన టీటీడీకి మంచి పేరు తేవాలని కర్తవ్య బోధ చేశారు. సనాతన హిందూ సంస్కృతి, సంప్రదాయాన్ని అర్థం చేసుకుని భక్తులకు చక్కటి ఆతిథ్యం ఇస్తూ సేవ చేయాలన్నారు. టీటీడీ చట్టాలు, సర్వీస్ నిబంధనలు, ఆలయాల నిర్వహణ ఇతర అంశాల్లో నిపుణులు శిక్షణ ఇచ్చేలా కార్యక్రమం రూపొందించామని తెలిపారు. ఈవో డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి మార్గదర్శకంలో నెల రోజుల్లోనే 119 మంది కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించామన్నారు. టీటీడీ చరిత్రలో ఇదో రికార్డ్ అని, ఇందుకోసం పని చేసిన అధికారులు, ఉద్యోగులకు శ్రీమతి సదా భార్గవి అభినందనలు తెలిపారు. 12 రోజుల పాటు వివిధ అంశాలపై నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చిన్మయ మిషన్ కడప జిల్లా శాఖ అధ్యక్షులు స్వామి తురీయా నంద సరస్వతి మాట్లాడుతూ, జీతం కోసం ఉద్యోగం చేయరాదన్నారు. స్వామి వారు ఇచ్చిన ఈ భాగ్యాన్ని భక్తుల సేవకు ఉపయోగిస్తే ఆయన సంతోషిస్తారని అన్నారు. స్విమ్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వనజాక్షి మాట్లాడుతూ, మనిషి ప్రాణం పోయినా పరవాలేదని, విలువలు మాత్రం పోగొట్టుకోరాదన్నారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే భక్తులకు, సంస్థకు మంచి సేవచేయగలుగుతారన్నారు. పురుషుల కంటే మహిళలకు కొన్ని అధిక శక్తులు ఉంటాయని, అందుకే మహిళను శక్తి స్వరూపంగా అభివర్ణిస్తారన్నారు. కుటుంబాన్ని, ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వర్తించే అవకాశం మహిళలకు ఉంటుందని, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. శ్వేత డైరెక్టర్ డాక్టర్ రామాంజులు రెడ్డి మాట్లాడుతూ, ఇది గోవిందుడు ఇచ్చిన అవకాశమన్నారు. శ్వేత విధులు, ప్రవర్తనా నియమావళిని వివరించారు. టీటీడీ విద్యావిభాగం డిప్యూటి ఈవో గోవింద రాజన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చాప కింద నీరులా వైరస్



హైదరాబాద్, జూలై 15, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో కరోనా చాప కింద నీరులా విస్తరిస్తోంది. జనం కొవిడ్?రూల్స్?పక్కన పెట్టేయడంతో ఇదే అదనుగా వైరస్ తన పని తాను చేసుకుపోతోంది. మిగిలిన జిల్లాల సంగతి ఎలా ఉన్నా ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో మాత్రం కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. లాక్?డౌన్ తర్వాత కనీస జాగ్రత్తలను గాలికి వదిలేయడం, పార్టీలు, ఫంక్షన్లంటూ హడావుడి చేయడం, శుభ, అశుభ కార్యాలకు పరుగులు తీయడం లాంటి కారణాలతో ఈ జిల్లాల్లో ఎక్కువ మంది కరోనా బారిన పడ్డారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రోజుకు 300 పైగా పాజిటివ్? కేసులు నమోదవుతున్నాయి. జాతీయ స్థాయిలో కేంద్రం ప్రకటించిన అత్యధిక పాజిటివిటీ ఉన్న జిల్లాల్లో ఖమ్మం ఒకటి కావడం అందరినీ షాక్ కు గురిచేసింది. దీంతో ఒక్కసారిగా మళ్లీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అలర్టయి కేసుల కట్టడిపై దృష్టిపెట్టారు. మొన్నటి వరకు ఏపీ సరిహద్దుగా ఉన్న మండలాల్లోనే ఎక్కువగా కేసులు వస్తున్నాయని చెప్పిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆ తర్వాత ఇతర మండలాల్లో కూడా కేసులు పెరగడాన్ని గుర్తించారు. ఖమ్మం సిటీతో పాటు కామేపల్లి, కారేపల్లి, ఖమ్మం రూరల్, చింతకాని మండలాల్లోనూ పెద్ద సంఖ్యలో కేసులు వచ్చాయి. లాక్ డౌన్ ఎత్తేసిన తర్వాత ఫంక్షన్ల పేరుతో వందలాది మంది ఒక్కచోటుకు చేరడం, మందు పార్టీలు, దావత్ లు చేసుకోవడం వల్లే వ్యాప్తి పెరిగిందని ఆఫీసర్లు గుర్తించారు. ఈ క్రమంలో ఇప్పటికే రెండుసార్లు ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో 584 గ్రామాలుండగా, పట్టణాలు, గ్రామాల్లో కలిపి 1,300కు పైగా టీమ్ లను ఏర్పాటు చేశారు. వాళ్ల ద్వారా ఇంట్లో ఎంత మందికి జ్వరం, జలుబు, ఇతర కోవిడ్ లక్షణాలున్నాయో తెలుసుకుంటున్నారు. ఊళ్లలో ఎక్కడైనా పదికి పైగా యాక్టివ్ కేసులు నమోదైతే ఆ గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో ఐసోలేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం సిటీలో రెండు నెలల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికలు కూడా కరోనా వ్యాప్తికి కారణమయ్యాయన్న విమర్శలున్నాయి. ఏప్రిల్ 30న పోలింగ్ జరగ్గా, మే 3న ఫలితాలు రిలీజయ్యాయి. ఆ టైంలో వందల సంఖ్యలో జనం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, ర్యాలీలు, సభలంటూ రోడ్లపై తిరగడం కామన్ అయింది. అప్పుడు కరోనా బారిన పడ్డ చాలామంది ఇంట్లో కుటుంబ సభ్యులకు అంటించారు. ఆ తర్వాత కూడా కేసుల సంఖ్య కంట్రోల్ కాకపోవడానికి ఎన్నికలే కారణమయ్యాయని ఆఫీసర్లు చెబుతున్నారు. నల్గొండ జిల్లాలో 40 పీహెచ్?సీలు ఉండగా 21 పీహెచ్?సీల పరిధిలో కరోనా ఉధృతి కనిపిస్తోంది. అర్బన్ ఏరియాల్లోని ఆరు సెంటర్లలో 545, రూరల్? ఏరియాల్లోని 15 పీహెచ్?సీల పరిధిలో 1591 యాక్టివ్? కేసులు ఉన్నాయి. ఆయా చోట్ల పాజిటివిటీ రేటు 2 నుంచి 7.5 దాక నమోదవుతోంది. ఇది క్రమంగా పెరుగుతుండడంతో ఆఫీసర్లు ఒక్కసారిగా అలర్ట్? అయ్యారు. రెండు రోజుల క్రితం హెల్త్? సెక్రెటరీ రిజ్వీ హెల్త్? ఆఫీసర్లతో రివ్యూ చేశాక ఇంటింటి ఫీవర్ సర్వే ప్రారంభించారు. రెండు రోజులపాటు చేసిన సర్వేలో ఇప్పటివరకు 1,912 మందికి కరోనా లక్షణాలు ఉన్నట్లు గుర్తించి కిట్లు పంపిణీ చేశారు. ప్రధానంగా నల్గొండ, మిర్యాలగూడ డివిజన్లలో కరనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. మిర్యాలగూడ డివిజన్?కు ఏపీ బార్డర్?తో లింక్?ఉన్నందునే వైరస్ వ్యాప్తి ఎక్కువుందని ఆఫీసర్లు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలో కరోనా పాజిటివిటీ రేటు ఎక్కువగా ఉన్న పీహెచ్?సీల పరిధిలోనే కొత్తగా కరోనా లక్షణాలు బయటపడుతున్నాయని హెల్త్?స్టాఫ్?చెబుతున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండకపోతే థర్డ్?వేవ్?ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు.

## విచిత్రమైన పన్నులు వేసే పాలకులు జనం మురికి నీటిలో ఉంటే పట్టించుకోరా...!

### నాటి యూజీడీ అవినీతి నేడు నగరవాసులకు శాపం... వి.ఎస్.అమీర్ బాబు

కడప జూలై 15 కడప నగరంలో నీటమునిగిన ఎన్జీఓ కాలనీ, ఎస్బీఐ కాలనీలను కడప అసెంబ్లీ టీడీపీ ఇన్చార్జ్, వి.ఎస్.అమీర్ బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వి.ఎస్.అమీర్ మీడియాతో మాట్లాడుతూ... ఏళ్లతరబడి కడప నగరాన్ని పాలిస్తున్న వైసీపీ పాలకుల, అధికారుల చిత్తశుద్ధి లేమి కారణంగా వర్షం వచ్చిన ప్రతిసారి కడవ నగరం జలమయమవుతున్నదని వి.ఎస్.అమీర్ బాబు మండిపడ్డారు. చెరువులోకి సాఫీగా వెళ్లే నీటి ప్రవాహాన్ని, భూకాంక్షపరుల భూదాహానికి బలైౖ కాలువల ఆక్రమణలు, అలైన్మెంట్ ల మార్పు ద్వారా వర్షం పడ్డ ప్రతిసారీ వరద నీరు ఇళ్లలోకి వచ్చి జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలతో పాటు సగం కడప నగరం పూర్తిస్థాయిలో జలమయం అయిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ప్రారంభించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పథకంకు 100 కోట్లు ఖర్చు పెట్టినా ఫలితం శూన్యమని ఆరోపించారు. సక్రమంగా డ్రైనేజీ, మురికి కాలువలు లేక, చెరువుల, కాలవల ఆక్రమణలతో పై ప్రాంతం, కింది ప్రాంతం అనే తేడా లేకుండా జలమయం అవుతున్నదన్నారు. కడప మురికిమయం, జలమయం, అక్రమార్కుల మయం కాకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షులు సానపురెడ్డి శివకొండా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నక్కల శివరాం, జిల్లా అధికార ప్రతినిధి బాలదాసు మరియు టీడీపీ నాయకులు రవిశంకర్ రెడ్డి, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

## పాలిచర్లపాడు, కురిచర్లపాడు ఆర్ బి కె లలో రైతు భరోసా చైతన్య యాత్రలు

నెల్లూరు జూలై 15, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా వెంకటాచలం మండల పరిధిలోని పాలిచర్ల పాడు, కురిచర్లపాడు ఆర్ బి కె లలో రైతు భరోసా చైతన్య యాత్రలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జె డి ఎ శివ నారాయణ, జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ శ్రీనివాసులు, నెల్లూరు ఏ డి ఏ బాలాజీ నాయక్ , పశు వైద్య అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలోని వ్యవసాయ రైతులకు ప్రభుత్వం వారు ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీ పొందే అవకాశం ఉందన్నారు. ఈ సబ్సిడీ పొందాలంటే రైతులు ఎక్కువ సంఖ్యలో ఆయా ప్రాంతాల లోని రైతు భరోసా కేంద్రాలలోని వి ఏ ఏ ఏ ల ద్వారా రైతులు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకుని, ఎవరెవరికి ఏమి కావాలో దాని ప్రకారమే నగదు చెల్లించి రసీదు పొందాలని సూచించారు. అనంతరం రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట లేదా విత్తనాలను ఆయా ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రాలకు ఏపీ సీడ్స్ వారి ద్వారా పొందేందుకు అవకాశం ఉందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.అదే విధంగా పచ్చి రొట్ట వేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని, వాటిని సరి అయిన సమయంలో అనగా, 50 శాతం పూత దశలో కలియ దున్నాలి అని తెలిపారు .కనీసం 15రోజులు నీటిలో ము రగనివ్వాలి అని సూచించారు.ఇవి వేసిన పొలంలో మొదటి దఫా నత్రజని ఎరువులు తగ్గించాలని,రసాయనిక ఎరువులు 25 శాతం తగ్గించుకోవచ్చు అని వెంకటాచలం ఇంఛార్జి మండల వ్యవసాయ అధికారి రాధ యడవల్లి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయం,వ్యవసాయ అనుబంధ సేవలను ఆయా ప్రాంతాలలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా పొందాలని రైతులకు అవగాహన కల్పించారు.

## లారీ యజమానికి బెదిరించిన విలేకరులు ఆరెస్టు

కొత్తపేట జూలై 15, (న్యూస్ పల్స్)బియ్యం లారీని ఆపి రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేసిన ఏడురు విలేకరులపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేసారు. బుధవారం తెల్లవారుజామున 16వ నెంబర్ జాతీయ రహదారిపై రావులపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు అంటూ గుంటూరుకు చెందిన ఒక బియ్యం లారీని ఆపి రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేసారు. లేని పక్షంలో లారీని పౌరసరఫరాల శాఖకు సంబంధించిన బియ్యం గా కేసు నమోదు చేయించి మిమ్మల్ని జైలుకు పంపిస్తామని బెదిరించారు. దాంతో సరుకు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. దాంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆకొండి వీర వెంకట సత్య సూర్యనారాయణ మూర్తి (పశ్చిమ వాహిని తిరుపతి), చిర్రా నాగరాజు (ఆర్టీఐ యాక్టు న్యూస్ ఛానల్), అయినవిల్లి విజయ్ బాబు (అనంత వాయిస్ తెలుగు దినపత్రిక), ఉందుర్తి రవికుమార్ (డీఆర్ ఎస్ యూట్యాబ్ ఛానల్), పలివెల రాజు (జై జనని తెలుగు దినపత్రిక), ఉమ్మిడిశెట్టి వెంకరేశ్వరరావు (గోదావరి తెలుగు దినపత్రిక), సీహెచ్ రాజేంద్రప్రసాద్ (వి 10 ఛానల్)లపు కొత్తపేట కోర్టులో హాజరుపరిచనున్నట్లు డిఎస్పీ వై. మాధవరెడ్డి తెలిపారు.

### అతి పురాతన జైన్ టెంపుల్ ను పరిశీలించిన పురావస్తు శాఖ ఏడీ రజిత

అనంతపురంఅనంతపురం జిల్లా, కంబదూరు మండల కేంద్రంలో ప్రాచీన కాలంలో నిర్మితమైన అక్కమ్మ జైన్ టెంపుల్ అభివృద్ధికి నోచుకోవడం లేదని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో, స్పందించిన అనంతపురం జిల్లా పురావస్తు శాఖ ఏడీ రజిత ,స్థానిక సర్పంచ్ పద్మ తిమ్మప్ప మరియు మండల అధికారులతో కలిసి ప్రాచీన అక్కమ్మ జైన్ టెంపుల్ స్థితి గతులను పరిశీలించారు. అనంతరం పురావస్తు శాఖ ఏడీ రజిత మీడియాతో మాట్లాడుతూ 6 వ శతాబ్దం లో జైన్ మతం ప్రారంభం అయింది అని,అలాగే కంబదూరు ప్రాంతాన్ని చాళుక్యులు, పల్లవులు, విజయనగర రాజులు పరిపాలించారు. అక్కడ ఉన్నటువంటి శివలింగాలు, అక్కమ్మ దేవాలయం, జైన్ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అన్నివిధాలుగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని మీడియాకు వెల్లడించారు. అంతేకాకుండా ఈ ఆలయానికి సంబంధించిన భూమిని గతంలో కొంతమంది వ్యక్తులు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకున్నారనీ , వాటికి సంబంధించిన వివరాలను సర్వే ద్వారా వెలికితీసీ , ఆలయానికి ప్రత్యేక రస్తా, కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టినీ కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎంపిడిఓ శివారెడ్డి, స్థానిక నాయకులు నీలి శంకరప్ప, యువ నాయకులు గంగాధర, మంజు, వీరేంద్ర స్వామి, చెన్నకేశవవులు , తదితర ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొండ కుమ్మర్ల పై సర్వే

విశాఖపట్నం అరకు నియోజ క వర్గ పరిధిలో వున్న కొండ కుమ్మర్లను మన్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు సర్వే నిర్వహించారు. గురువారం నాడు అరకు మండల పార్టీ అధ్యక్షుడు కొర్ర గాసి ఆధ్వర్యంలో మండల టీమ్ మాడగడ పంచాయితీలో పర్యటించింది. ఈ సందర్భంగా కొర్ర గాసి మాట్లాడుతూ దశాబ్దాల పాటు ఏజెన్సీ ప్రాంతంలో దుర్భర జీవితం గడుపుతున్న,కొండ కుమ్మరిలు,ఎన్నో ఏళ్ల నుండి ఏజెన్సీ ప్రాంతంలో ఉంటున్న కూడా ఎస్టీ జాబితా లేకుండా వేరే ఏ జాబితాలో కూడ రిజర్వేషన్లు లేకుండా అటు ఇటు గా మధ్యలో ఉన్న కొండ కుమార్ల,కష్టాలు,వర్ణనాతీతమని అన్నారు. ఈ ప్రాంతంలో అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా వారి గ్రామాల్లో పర్యటించి వారి, జీవన స్థితిగతులను చూసి చలించిపోయి,మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి,నేను ఎమ్మెల్యే అయితే తప్పకుండా మీ సమస్యని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి,మీకు న్యాయం చేస్తానని మాట ఇచ్చి, ఈ సంవత్సరం తన వివేకంతో ప్రభుత్వాన్ని మెప్పించి,ఒప్పించి పట్టుదలతో కృషి చేసి ఇటీవలే కొండ కుమ్మరి లను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ప్రభుత్వ అధికారులు మన్యం లో పర్యటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారి ఆదేశాలు మేరకు ఈ రోజు అరకు మండల టీం మాడగడ పంచాయతీలో పర్యటించి కొండ కుమ్మరులకు సంఘీభావం తెలిపారు. మీకు అండగా సీఎం జగన్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ ఉంటారని మండల టీం భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్,జ్యోతి, పీయేసీ చైర్మన్ శ్రీను, సీనియర్ నాయకులు, లక్ష్మణ్, రామ్మూర్తి, బాలరాజు అప్పలస్వామి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తమ్ముడా... మజాకా

ఒంగోలు, జూలై 15, (న్యూస్ పల్స్)రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అన్నట్టుంది వైసీపీ ఎమ్మెల్యే సోదరుడి వ్యవహారం. మా సొంత పని కూడా చేయవా అంటూ విద్యుత్ శాఖ అధికారిపై జులుం ప్రదర్శించడమే కాకుండా.. నువ్వు అంటూ అమర్యాదగా మాట్లాడారు. అది తన పరిధిలో లేదని.. ఉన్నతాధికారులతో మాట్లాడాలని చెప్పినా ఫోన్‌లో ఇబ్బందికర వ్యాఖ్యలు చేయడంతో సదరు అధికారి కూడా అదే స్థాయిలో రిప్లై ఇచ్చారు. మరోమారు తనను నువ్వు అంటూ ఏకవచనంతో పిలవొద్దని తేల్చిచెప్పేశారు. ఇంకేముంది ఆ వీడియో వైరల్‌గా మారడంతో తీవ్ర కలకలం రేపింది. చివరికి ఏం జరుగతుందోనన్న ఉత్కంఠ రేపిన ఈ ఘటనలో ఊహించినదే జరిగింది. ఖద్దరు నేత పలుకుబడి పనిచేసింది. కనీస మర్యాద కోరుకున్నందుకు సదరు అధికారిపై వేటు పడింది. ప్రకాశం జిల్లా దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడి వ్యవహారం అధికారులు, నేతల మధ్య కాకరేపుతోంది. ఎమ్మెల్యే సోదరుడు మద్దిశెట్టి శ్రీధర్ కనిగిరి విద్యుత్ ఈఈ భాస్కర్‌రావుతో మాట్లాడినట్లు చెబుతున్న ఆడియో కలకలం రేపింది. దర్శి నియోజకవర్గంలోని కొన్ని మండలాలు కనిగిరి విద్యుత్ సర్కిల్ పరిధిలోకి వస్తాయి. ఎమ్మెల్యే స్వగ్రామం కూడా కనిగిరి నియోజకవర్గంలోని పామూరు మండలంలో ఉంది. దర్శి నియోజకవర్గంలోని కురిచేడు మండలం బోదనంపాడులో ఎమ్మెల్యే మద్దిశెట్టికి భూములున్నాయి. తమ భూములకు విద్యుత్ కనెక్షన్ విషయమై ఎమ్మెల్యే సోదరుడు శ్రీధర్ కనిగిరి ఈఈ భాస్కర్‌రావుకి ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. మా సొంత పని కూడా చేయవా అంటూ శ్రీధర్ ఆవేశంగా ఈఈతో మాట్లాడినట్లు ఆడియోలో రికార్డైంది. మీరు అడిగిన పని నా పరిధిలో లేదు.. ఎస్ఈతో చేయించుకోండి అంటూ ఈఈ సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే తమ్ముడు శ్రీధర్ ఈఈని నువ్వు, నువ్వు అంటూ సంభాషించడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. మీరు ఎమ్మెల్యే తమ్ముడు అయితే కావొచ్చు.. నేను అధికారిని అయితే కావొచ్చు.. కానీ ఇలా మాట్లాడితే సహించనని ఈఈ చెప్పినట్లు తెలుస్తోంది.

మరుసటి రోజు ఆ ఆడియో కాల్ రికార్డులను జిల్లా అధికారులకు పంపి ఈఈ భాస్కరరావు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.అనంతరం కొద్దిసేపటికే ఎమ్మెల్యే మద్దిశెట్టి సోదరుడు ఈఈ భాస్కరరావుతో సంభాషణ బయటికి పొక్కింది. ఆ ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో వ్యవహారం సీరియస్ అయింది. ఆడియో కాల్ లీక్ కావడం.. సోషల్ మీడియా, టీవీ చానల్‌లో రావడంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సదరు ఈఈపై చర్యలకు ఉపక్రమించారు. ఈఈ భాస్కర్‌రావుని సస్పెండ్ చేస్తూ రాత్రికి రాత్రే ఉత్తర్వులు వచ్చినట్లు సమాచారం. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఒత్తిడితోనే ఆయనపై వేటు పడినట్లు ప్రచారం జరుగుతోంది. అందులోనూ విద్యుత్ శాఖా మంత్రి కూడా సొంత జిల్లా మంత్రే కావడంతో సస్పెన్షన్ వ్యవహారం చకచకా జరిగిపోయినట్లు చెప్పుకుంటున్నారు.

# ఆకస్మికంగా గ్రామ సచివాలయాలు తనిఖీ

**సచివాలయానికి వచ్చే సర్వీసులను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించాలి**

**-సచివాలయ సేవల గురించి ఇంటింటికి తెలియజేయాలి**

**సచివాలయ సిబ్బందికి ఆదేశించిన జిల్లా కలెక్టర్ జి. వీరపాండియన్**

కర్నూలు, జూలై 15 ( విభారె) ప్రజల దగ్గరగా ఉంటూ మెరుగైన సేవలు అందించడంతో పాటు సచివాలయానికి వచ్చే సర్వీసులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ జి.వీరపాండియన్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు.గురువారం మధ్యాహ్నం పాణ్యం నియోజకవర్గం, పాణ్యం మండలం, బలపనూరు గ్రామ సచివాలయం, పాణ్యం గ్రామ సచివాలయం మరియు 1, 2 లను జిల్లా కలెక్టర్ జి.వీరపాండియన్, నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సంయుక్తంగా ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక, ప్రభుత్వ పథకాల పోస్టర్ లు తదితర వాటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు సచివాలయానికి ఎన్ని సర్వీసులు వచ్చాయి, ఎన్ని సర్వీసులకు పరిష్కారం చూపించారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెట్ వర్క్ ఆసుపత్రుల జాబితాను పరిశీలించి ఎవరైనా రోగులు సచివాలయానికి వస్తే వారికి ఎక్కడ రెఫర్ చేస్తున్నారు... ఎవరితో మాట్లాడుతున్నారు.ఇప్పటివరకు ఎంతమందికి రేఫర్ చేశారు.వంటి వివరాలను ఏఎన్ఎంను అడిగి రికార్డులను పరిశీలించారు. బలపనూరు గ్రామ సచివాలయం, పాణ్యం గ్రామ సచివాలయం 1, 2 పరిధిలో ఎంతమందికి వ్యాక్సిన్ ఇచ్చారు. 45 సంవత్సరాల పైబడిన వారికి ఎంతమందికి వ్యాక్సిన్ వేశారు. ఫ్రెంట్ లైన్ వర్కర్లు ఎంతమంది ఉన్నారు. ఎంతమందికి వ్యాక్సిన్ ఇచ్చారు. ఇంకా రెండవ డోస్ ఎంతమంది వేయించుకోవాలి వంటి వివరాలను ఏఎన్ఎంను అడిగి రికార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ చాలా అద్వానంగా జరుగుతుందని, అందరిని మోటివేషన్ చేసి 100% వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఏ ఎన్ ఎంలకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# కరోనా వ్యాక్సిన్ పొటాషియం? మీకు కరోనా ఉంటే సంభవించే లక్షణాలు ఇక్కడ ఉన్నాయి ...

ఈ రోజు వరకు కరోనా వైరస్ చాలా భయంకరమైన ఉత్పరివర్తనాలకు గురైంది మరియు చెత్త విధ్వంసానికి కారణమైంది. ఈ వైరస్కు వ్యతిరేకంగా టీకాలు కనుగొన్నప్పటికీ, అవి చాలా ప్రభావవంతంగా లేవని ఆధారాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే కరోనాలో ఉన్న కొత్త ఉత్పరివర్తనలు వ్యాక్సిన్‌లో అమర్చిన ప్రతిరోధకాల నుండి సులభంగా తప్పించుకోగలవు. అందువల్ల, టీకాలు వేసిన వారికి కరోనా ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక పురోగతి కేసులు నమోదవుతున్నాయి. దీని అర్థం ఏమిటంటే, కరోనా టీకాలు వేసిన వ్యక్తులను కూడా ప్రభావితం చేస్తుంది మరియు వారిలో ఎక్కువ మంది డెల్టా రకం కరోనా బారిన పడ్డారు. అదనంగా, టీకాలు వేసిన వ్యక్తులు కరోనా బారిన పడినప్పుడు, టీకాలు వేయని వారితో పోలిస్తే ఇది తీవ్రత, ఆసుపత్రిలో చేరే ప్రమాదం మరియు మరణాల ప్రమాదంలో తేడా ఉంటుంది. టీకా తర్వాత కరోనా వస్తే, అది కలిగించే లక్షణాలలో తేడాలు ఉండవచ్చని వైద్య అధ్యయనాలు కూడా చూపిస్తున్నాయి. టీకాలు వేయడం మరియు సంక్రమణ ప్రమాదం ... టీకాలు వేయడం మరియు సంక్రమణ ప్రమాదం ... టీకా పని కరోనా వైరస్ నుండి రోగనిరోధక శక్తిని మరియు రక్షణను అందించే ప్రతిరోధకాలను వెంటనే అందించడం. అయితే, టీకాలు వంద శాతం రక్షణ కల్పిస్తాయనే గ్యారెంటీ లేదు. సంక్రమణ ప్రమాదాన్ని, వ్యాప్తి రేటు, తీవ్రత మరియు మరణ ప్రమాదాన్ని తగ్గించడానికి ఇవి పనిచేస్తుండగా, కరోనా సంక్రమణ ప్రమాదం కూడా ఉందని గుర్తుంచుకోండి. వ్యక్తిగత ప్రమాద కారకాలు మరియు మీరు ఇస్తున్న టీకా రకాన్ని బట్టి తీవ్రత మరియు లక్షణాలు మారవచ్చని కూడా గుర్తుంచుకోండి. తెల్ల జుట్టు చాలా త్వరగా రాకుండా ఉండటానికి .. మీరు దీన్ని అనుసరించవచ్చు..!తెల్ల జుట్టు చాలా త్వరగా రాకుండా ఉండటానికి .. మీరు దీన్ని అనుసరించవచ్చు..! యుకె సర్వే యుకె సర్వే యుకెకు చెందిన జో సింప్టమ్ స్టడీ యాప్ ఇలాంటి సర్వే నిర్వహించింది. ఇది సాధారణంగా వివిధ సమూహాలు మరియు వర్గాలలోని లక్షణాలను పరిశీలించింది. టీకాలు వేసిన వారు కొన్ని లక్షణాలకు గురయ్యే అవకాశం ఉందని, అలాంటి లక్షణాలు గుర్తించబడవని ఇది వెల్లడించింది. అందువల్ల, టీకా తర్వాత కూడా కొట్టే కరోనా వైరస్ యొక్క లక్షణాల గురించి తెలుసుకోండి, ఎందుకంటే టీకా తర్వాత కూడా సంక్రమణ ప్రమాదం ఉంది. ఈ ఆహారాలతో ఎప్పుడూ పండ్లు తినకూడదు ... లేదంటే, బాధపడాల్సి వస్తుంది ...ఈ ఆహారాలతో ఎప్పుడూ పండ్లు తినకూడదు ... లేదంటే, బాధపడాల్సి వస్తుంది ... తలనొప్పి తలనొప్పి సాంక్రమ-అూం-2 వైరస్ యొక్క సాధారణ లక్షణాలలో తలనొప్పి ఒకటి. ఇది డెల్టా రకం కరోనా యొక్క లక్షణంగా కూడా నివేదించబడింది. శరీరంలో కరోనా ఇన్ఫెక్షన్ ఉంటే, అది మంట మరియు పర్యవసానంగా తలనొప్పికి కారణమవుతుంది. కొన్నిసార్లు మీరు కండరాల నొప్పులు మరియు శరీర నొప్పులను కూడా అనుభవించవచ్చు. ఒక వ్యక్తికి 3 రోజులకు మించి తలనొప్పి ఉంటే, అది కొన్ని రకాల దృఢత్వం, తిమ్మిరి, జలదరింపు మొదలైన వాటికి కారణమవుతుంది మరియు సాధారణ పనితీరును ప్రభావితం చేస్తుంది. నాలుక రంగు మారితే మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావమంటే...నాలుక రంగు మారితే మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావమంటే... ముక్కు దిబ్బెడ ముక్కు దిబ్బెడ ముక్కు కారటం, నాసికా రద్దీ వంటి జలుబు లక్షణాలను మీరు అనుభవిస్తే దాన్ని విస్మరించవద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వైరస్ శరీరంలోకి ప్రవేశించి, దాని దాడిలో పరివర్తన చెందుతున్నప్పుడు, ఇది ముక్కు కారటం వంటి ఎగువ శ్వాసకోశ లక్షణాలను అనుభవించవచ్చు. కాబట్టి టీకాలు వేసిన తర్వాత మీకు ఇలాంటి లక్షణం ఉంటే. వెంటనే పరీక్షించండి. తుమ్ము తుమ్ము అనేక అధ్యయనాల ప్రకారం, కరోనాకు టీకాలు వేసిన వారిలో తుమ్ము సమస్య ఉండటం ఒక వింత లక్షణంగా చెప్పబడింది. కరోనా వ్యాక్సిన్‌తో తుమ్ము సమస్య ఉన్నవారికి పరీక్షలో కరోనా ఉనికిని నిర్ధారించడం దీనికి కారణం. తుమ్ము అనేది కరోనా సంక్రమణ యొక్క క్లాసిక్ లక్షణం కానప్పటికీ, తుమ్ముకు వ్యతిరేకంగా టీకాలు వేసిన వారిలో ఇది కరోనా లక్షణం అని ఇప్పటివరకు చేసిన అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీని గురించి మరింత తెలుసుకోవడానికి నిపుణులు ప్రయత్నిస్తున్నారు. గొంతు మంట గొంతు మంట జ్వరం మరియు దగ్గు కరోనా సంక్రమణ యొక్క ప్రారంభ మరియు ముఖ్యమైన లక్షణాలు అయితే, గొంతు నొప్పి లేదా గొంతు కరోనాకు సంకేతం. మరియు ఇది కూడా జాగ్రత్త వహించాల్సిన సంకేతం. గొంతు

# ఇండియన్ క్రికెట్ టీమ్‌లో మరో స్టాఫ్ మెంబర్‌కూ కరోనా

లండన్: ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు ఇండియన్ క్రికెట్ టీమ్‌ను కరోనా వణికిస్తోంది. వికెట్ కీపర్ రిషబ్ పంత్ కరోనా బారిన పడ్డాడని ఇప్పటికే వార్తలు రాగా.. తాజాగా ఓ స్టాఫ్ మెంబర్‌కు కూడా పాజిటివ్‌గా తేలినట్లు సమాచారం. అతనితోపాటు మరో ముగ్గురు కోచింగ్ సిబ్బంది కూడా ప్రస్తుతం ఐసోలేషన్‌లో ఉన్నారు. వీళ్లెవరూ టీమ్‌తో కలిసి దర్హమ్ వెళ్లడం లేదు.డబ్ల్యూటీసీ ఫైనల్ తర్వాత టీమ్ సభ్యులు బయో బబుల్ నుంచి బయటకు వెళ్లారు. కొందరు యూరో ఫుట్‌బాల్ మ్యాచ్‌లు చూడటానికి వెళ్లారు. రిషబ్ పంత్ కూడా అలా యూరోకి వెళ్లే కరోనా బారిన పడ్డాడు. యూకేలో కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో అందరూ కొవిడ్ ప్రొటోకాల్ పాటించాలని ఇప్పటికే బీసీసీఐ కార్యదర్శి జే షా ప్లేయర్స్‌కు మెయిల్ కూడా చేశారు.

# 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' రేంజ్ లో 'మహాభారతం' వెబ్ సిరీస్ ప్లాన్ చేస్తున్న దిగ్గజ ఓటీటీ..?




భారతీయ ఇతిహాసం 'మహాభారతం' ఆధారంగా ఇప్పటికే అనేక భాషల్లో సినిమాలు తెరకెక్కాయి. హిందువులకు పంచమ వేదంగా పరిగణించే 'మహాభారతం' లోని అధ్యాయాలను తీసుకొని రకరకాల పేర్లతో ఎన్ని సినిమాలు తీసినా ప్రేక్షకులు ఆదరిస్తూనే ఉన్నారు. టెక్నాలజీ అందుబాటులోకి వస్తున్న కొద్దీ భారీ బడ్జెట్ కేటాయిస్తూ మహాభారతాన్ని వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కొందరు ఫిలిం మేకర్స్ అందులోని అధ్యాయాలను తీసుకొని సినిమాలుగా రూపొందిస్తే.. మరొకొందరు అందులోని పాత్రలను తీసుకొని ఒక్కో కోణంలో ఒక్కో సినిమాగా మలిచారు.అయితే ఇంతవరకు ఏ ఫిల్మ్ మేకర్ కూడా 'మహాభారతం' మొత్తాన్ని తెరపైన చూపించలేకపోయారనే చెప్పాలి. పలు భాషల్లో ఆ దిశగా ప్రయత్నాలు చేశారు కానీ ఏదీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పూర్తి భారతాన్ని చూపించడానికి భారీ ఎత్తున సన్నాహాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. అయితే అది సినిమాగా కాకుండా వెబ్ సిరీస్ గా రూపొందించనున్నారని ఫిలిం సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.డిజిటల్ వరల్డ్ లో సత్తా చాటుతున్న వరల్డ్ టాప్ ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్ ఒకటి "మహాభారతం" ఇతిహాసన్ని వెబ్ సిరీస్ గా మలచడానికి ఏర్పాట్లు చేస్తోందట. దీని కోసం దాదాపు 3000 కోట్ల బడ్జెట్ ను కేటాయించనున్నారట. హిందీ ఇంగ్లీష్ లతో పాటుగా పలు భారతీయ భాషల్లో ఈ సిరీస్ ని రూపొందించే ఆలోచన చేస్తున్నారట. ఈ మేరకు ఇప్పటికే ఒక పాపులర్ సౌత్ ఇండియన్ డైరెక్టర్ తో సదరు దిగ్గజ ఓటీటీ చర్చలు కూడా ప్రారంభించినట్లు సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆ స్టార్ డైరెక్టర్ అయితేనే ఈ భారీ ప్రాజెక్ట్ ని డీల్ చేయగలడని భావించిన ఓటీటీ సంస్థ.. దర్శకుడికి ఎంత రెమ్యూనరేషన్ ఇవ్వడానికైనా రెడీ అయ్యారట. అగ్ర దర్శకుడి సైడ్ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' 'వైకింగ్స్' రేంజ్ లో 'మహాభారతం' వెబ్ సిరీస్ ని రూపొందించాలని ఓటీటీ వారు ప్లాన్ చేస్తున్నారట. ప్రస్తుతం ఇతర పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ కి కమిట్మెంట్స్ ఇచ్చిన స్టార్ డైరెక్టర్.. ఓటీటీతో డీల్ కుదుర్చుకుని ఈ సిరీస్ కి దర్శకత్వం వహిస్తారేమో చూడాలి. ఒకవేళ 'మహాభారతం' వెబ్ సిరీస్ కు అడుగులు పడితే మాత్రం ఓటీటీ వరల్డ్ లో సంచలనం సృష్టించడం ఖాయమని చెప్పవచ్చు.

# స్టార్ హీరోయిన్ కాలేజ్ డేస్ చేదు అనుభవాలు

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాబితాలో కరీనా కపూర్ ఖాన్ ముందు వరుసలో ఉంటుంది అనడంలో సందేహం లేదు. ఈమె తండ్రి.. సోదరి సినిమా పరిశ్రమకు చెందిన వారే అవ్వడంతో పాటు కపూర్ ఫ్యామిలీ మొత్తం కూడా బాలీవుడ్ ను ఏలేస్తున్న నేపథ్యంలో ఈమె హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.



కెరీర్ ఆరంభం నుండే ఈమెకు లక్ బాగుండి మంచి సినిమాలు పడ్డాయి. తద్వార తక్కువ సమయంలోనే బాలీవుడ్ లో టాప్ స్టార్ హీరోయిన్ గా పేరు దక్కించుకుంది. ఇండస్ట్రీలో ఈమె నటించిన నటిస్తున్న సినిమాలు ఇప్పటికి మంచి క్రేజ్ ను కలిగి ఉంటాయి. పెళ్లి చేసుకుని చాలా ఏళ్లు అయ్యింది.. ఇద్దరు పిల్లలకు తల్లి అయినా కూడా కరీనా కపూర్ ఇప్పటికి హీరోయిన్ గా బిజీగా నే ఉంది అంటే ఆమె రేంజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు.ఇప్పుడు విదేశాలకు ప్రత్యేక విమానంలో వెళ్లగలిగేంతటి ఆస్తులు ఉన్న ఈమె చదువుకునే రోజుల్లో కాలేజ్ కు మాత్రం ఆర్టీసీ బస్సుల్లో వెళ్లిందట. తండ్రి రణ్ దీర్ కపూర్ అప్పటికే గుర్తింపు ఉన్న సెలబ్రెటీ అయినా కూడా ఆర్థికంగా ఆయన బాగానే ఉన్నా కూడా కొన్ని కారణాల వల్ల ఆర్టీసీ ప్రయాణాలు చేయడంతో పాటు ఆర్థిక పరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందట. ఈ విషయాన్ని పలు సందర్భాల్లో కరీనా తో పాటు ఆమె అక్క కరిష్మ చెప్పుకొచ్చింది. కరిష్మ కపూర్ హీరోయిన్ గా చేస్తున్న సమయంలో కూడా కరీనా కపూర్ కాలేజ్ కు బస్సులు లేదా పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ లో వెళ్లేదట. వందల కోట్ల ఆస్తులు ఇప్పుడు ఉన్న కరీనా కపూర్ ఖాన్ ఒకప్పుడు మాత్రం పాకెట్ మనీ కోసం కూడా ఇబ్బంది పడ్డ సందర్భాలు చాలా ఉన్నాయట.రిష్మ కపూర్ ను హీరోయిన్ గా చేయాలని తల్లి బబిత భావించగా అందుకు రణ్ దీర్ ఒప్పుకోలేదట. దాంతో ఆయన నుండి దూరంగా వచ్చేసిన బబిత తన ఇద్దరు కూతుర్ల బాధ్యతను తీసుకుని వారిని ప్రయోజకులను చేశారు. ఆ సమయంలోనే వారు ముగ్గురు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నట్లుగా చెబుతూ ఉంటారు. కరిష్మ హీరోయిన్ గా బిజీ అయిన తర్వాత ఎప్పుడు కూడా వెను దిరిగి చూసుకోలేదు. కమర్షియల్ గా ఎప్పుడు ఇబ్బందులు ఎదురు కాలేదట. కరీనా కపూర్ కు ఆ కొంత కాలం మాత్రం జీవితాంతం గుర్తుండి పోయే జ్ఞాపకాలను మిగిల్చిందట. ఎప్పటికి తన కాలేజ్ డేస్ ను మర్చి పోలేను అని.. సెలబ్రెటీ అనే కాని కనీస ఆర్థిక పరమైన విషయాల్లో కూడా స్వేచ్ఛ ఉండేది కాదని కరీనా అప్పట్లో బాధపడేదట. కాని ఇప్పుడు మాత్రం ఆమె వేల కోట్ల సంపదకు వారసులు అయిన సైఫ్ అలీ ఖాన్ భార్య.అలాగే బాలీవుడ్ లో పదుల కోట్ల పారితోషికం తీసుకునే టాప్ హీరోయిన్. అందుకే పరిస్థితులు ఎప్పుడు ఒకేలా ఉండవు. కష్టపడితే ఖచ్చితంగా ఫలితం ఉంటుందని కరీనా కాలేజ్ డేస్ ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బాలీవుడ్ లో ఈ అమ్మడి సినిమాలు ఎన్నో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. వయసు పెరుగుతున్నా కూడా పారితోషికం మాత్రం తగ్గకుండా పెరుగుతూనే ఉంది. ఈ వయసులో కూడా ఇద్దరు పిల్లలకు తల్లి అయినా కూడా ఈమెను హీరోయిన్ గా తమ సినిమాల్లో పెట్టుకునేందుకు స్టార్ హీరోలు సిద్దంగా ఉన్నారు. తన అక్క కంటే ఎక్కువ కాలం స్టార్ హీరోయిన్ గా ఈమె నిలిచింది. ముందు ముందు కూడా ఈమె స్టార్ గానే కంటిన్యూ అవుతుందని అభిమానులు అంటూ ఉంటారు.

# అక్కినేని హీరోకు ఇది సెకండ్ ఇన్నింగ్స్ కానుందా!?

అక్కినేని ఫ్యామిలీ నుండి ఎంతో మంది హీరోలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. నాగేశ్వరరావు తర్వాత నాగార్జున మాత్రమే ఇండస్ట్రీలో స్టార్ డమ్ ను దక్కించుకున్నాడు. ఇప్పుడు నాగచైతన్య మరియు అఖిల్ లు హీరోలుగా స్టార్ డమ్ ను దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నాగార్జున హీరోగా టాప్ పొజీషన్ లో కొనసాగుతున్న సమయంలోనే అక్కినేని ఫ్యామిలీ నుండి నాగేశ్వరరావు కూతురు తనయుడు అయిన సుమంత్ ఎంట్రీ ఇచ్చాడు. సుమంత్ కెరీర్ ఆరంభం నుండి ఒడిదొడుకులు చూస్తూ వచ్చాడు. కెరీర్ ఆరంభంలోనే ఫ్లాప్ లు పడటంతో సుమంత్ కెరీర్ కాస్త కష్టాల మధ్య సాగింది. ముందు ముందు కుదురు కుంటుంది అని అక్కినేని ఫ్యాన్స్ మరియు ఫ్యామిలీ భావించింది. కాని సుమంత్ కెరీర్ ఆరంభించి ఇరవై ఏళ్లు దాటినా కూడా కమర్షియల్ గా సక్సెస్ ను దక్కించుకోలేక పోయాడు.నాలుగు పదుల వయసు లో సుమంత పడి చాలా కాలం అయ్యింది. కనుక ఆయన ఇంకా హీరోగా సక్సెస్ అవుతాడని ఏ ఒక్కరు అనుకోవడం లేదు. ఆయన లో మంచి నటుడు ఉన్నాడు కాని అదృష్టం కలిసి రాకపోవడం వల్ల ఫ్లాప్ లు పడ్డాయి. నటుడిగా సక్సెస్ అయిన సుమంత్ హీరోగా కమర్షియల్ సక్సెస్ ను దక్కించుకోవడం లో విఫలం అయ్యాడు. అందుకే సుమంత్ మెల్ల మెల్లగా సినిమాలకు దూరం అవుతున్నాడంటూ చాలా కాలంగా వార్తలు వస్తున్నాయి. కాని ఆయన తనకున్న పరిచయాలతో సినిమాలు చేస్తూనే ఉన్నాడు. సక్సెస్ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ప్రస్తుతం కూడా ఆయన సినిమాలు ఒకటి రెండు సెట్స్ పై ఉన్నాయి. ఇదే సమయంలో ఆయన సెకండ్ ఇన్నింగ్స్ ను మొదలు పెట్టే యోచనలో ఉన్నాడా అంటే అవును అంటూ ఇండస్ట్రీ లో కొందరు కామెంట్స్ చేస్తున్నారు. హీరోలుగా నటించిన జగపతి బాబు నుండి మొదలుకుని శ్రీకాంత్ వరకు చాలా మంది ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా లేదా విలన్స్ గా కొనసాగుతున్నారు.అన్ని భాషల్లో సీనియర్ హీరోలు కెరీర్ ను కొనసాగించాలంటే నాలుగు లేదా అయిదు పదుల వయసు దాటిన తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టులు గా మారుతున్నారు. అతి కొద్ది మంది మాత్రమే ఆరు పదుల వయసులో కూడా హీరోలుగా కొనసాగుతున్నారు అది వేరే విషయం. సుమంత్ నాలుగు పదుల వయసు లో ఉన్నాడు కనుక ఆయన సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టేయ వచ్చు అంటూ కొందరు సూచిస్తున్నారు. సుమంత్ సెకండ్ ఇన్నింగ్స్ అని కాదు కాని త్వరలో ఒక సినిమా లో ముఖ్య పాత్రలో కనిపించబోతున్నాడు. ఇండస్ట్రీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం మహానటి మేకర్స్ నిర్మాణంలో లెఫ్టినెంట్ రామ్ అనే సినిమా రూపొందబోతుంది. ఈ సినిమా కు అందాల రాక్షసి ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వం వహించబోతున్నాడు. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించబోతున్నట్లుగా చాలా నెలల క్రితమే వార్తలు వచ్చాయి.మహానటి తర్వాత దుల్కర్ నటించబోతున్న మరో డైరెక్ట్ తెలుగు సినిమా ఇదే. ఆయన ఇప్పటికే ఈ సినిమా కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు ఎప్పుడంటే అప్పుడు డేట్లు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నాడట. ఇన్ని రోజుల పాటు స్క్రిప్ట్ వర్క్ జరిపిన హను రాఘవపూడి ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో పడ్డాడు. అన్నపూర్ణ స్టూడియోలో ఈ సినిమా కోసం ఒక సెట్ నిర్మించడంతో పాటు నటీ నటులను ఎంపిక చేస్తున్నాడట. ఈ సినిమాలోని కీలక పాత్ర కోసం సుమంత్ ను సంప్రదించగా ఆయన వెంటనే ఒప్పుకున్నాడట. సినిమాలో సుమంత పాత్ర చాలా కీలకంగా ఉంటుందని అంటున్నారు. ఈ సినిమా తో సుమంత్ సెకండ్ ఇన్నింగ్స్ మొదలు అయ్యే అవకాశం ఉందని మీడియా వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా సక్సెస్ అయ్యి సుమంత్ పాత్రకు పేరు వస్తే మాత్రం క్యారెక్టర్ ఆర్టిస్టు గా సుమంత బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**